


ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ మొత్తాన్ని రూ.3 వేల నుంచి 4 వేల రూపాయలకు పెంచారు. సచివాలయ సిబ్బంది ద్వారా సోమవారం నుంచి ఇంటి వద్దే పెన్షన్లు ఇవ్వనున్నారు. పెంచిన 4 వేల రూపాయలతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన 3 వేలు కలిపి 7 వేల రూపాయలను ఒకేసారి లబ్ధిదారులకు ఇవ్వనున్నారు. దీంతో పెన్షన్‌దారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. సోమవారం ఉదయం 5 గంటల నుంచే సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల తలుపు తట్టి వారికి పెన్షన్ అందచేయనున్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇతర పెన్షన్ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడే పెన్షన్ల పండుగ

- ఇంటి వద్దే పంపిణీ చేయనున్న సచివాలయ సిబ్బంది
- ఒకేసారి లబ్ధిదారులకు రూ.7 వేల పంపిణీ
- వైసీపీ ప్రభుత్వంలో ఐదెకరాల పొలం ఉందని పెన్షన్ నిలిపివేత
- పంటలు పండక.. జీవనం గడవక..
- రైతన్నకు పెనుకష్టం..
- పండుటాకులకు చుక్కలు చూపించిన వైసీపీ ప్రభుత్వం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో 2,23,436 మందికి వివిధ రకాల సామాజిక పెన్షన్లను పంపిణీ చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా వృద్ధాప్య పెన్షన్లు 1,29,050 ఉన్నాయి. వితంతు పెన్షన్లు 46,219 మంది, వికలాంగులు 26,849, అభయహస్తం 5698, ఒంటరి మహిళలు 4449 మంది ఉన్నారు. స్వల్ప కిడ్నీ బాధిత లబ్ధిదారులు ముగ్గురు ఉన్నారు. మొత్తం గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లకు గానూ ఏటా రూ.250 చొప్పున పెన్షన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచింది. జిల్లాలో నెలకు రూ.65 కోట్లు పంపిణీ చేసేవాళ్లు. అయితే అధికారంలోకి రాగానే చంద్రబాబు ప్రభుత్వం ఈ పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచింది. దీంతో జూలై నుంచి నెలకు జిల్లాలో రూ.151.44 కోట్లు పంపిణీ చేయనుంది.

సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన పింఛను పెంపు హామీ సోమవారం అమలు కానుంది. జూలై 1వతేదీ సోమవారం జిల్లా వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది నేరుగా ఇంటింటికీ వెళ్లి పింఛన్ డబ్బులు అందించనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 1వ తేదీనే ఏప్రిల్, మే, జూన్ నెలల డబ్బు మూడువేలు కలుపుకుని జూలై నెలకు సంబంధించిన రూ.4 వేలతో కలిపి రూ.7 వేలు పొందుతుండడంతో పెన్షనర్లలో హర్షం వ్యక్తమవుతోంది. సోమవారం ఉదయం 5 గంటలకే పెన్షన్ పంపిణీ మొదలుకానుంది. 50 మందికో సచివాలయ సిబ్బంది పెన్షన్ పంపిణీ చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

రైతన్నకు చుక్కలు చూపించిన వైసీపీ ప్రభుత్వం

అసలే వానలు లేక. పంటలు పండక.. కనీసం పెట్టుబడులు కూడా రాక.. ఒకవేళ దిగుబడి వచ్చినా.. గిట్టుబాటు ధరలు లేక.. వ్యవసాయం చేయలేక.. అలాగని చేయకుండా ఉండలేక ఇబ్బందులు పడుతున్న రైతులకు.. ఐదెకరాల కంటే.. ఎక్కువ పొలం ఉండడం అడ్డుగా మారుతోంది. ప్రభుత్వం ఇస్తున్న సామాజిక పెన్షన్లకు ఐదెకరాల కంటే.. పొలం ఎక్కువగా ఉందనే కారణంతో.. ఆ రైతులకు సామాజిక పెన్షన్లను వైసీపీ ప్రభుత్వం అందకుండా చేసింది. దీంతో అసలే కరువుకోరల్లో చిక్కిన రైతులకు ఈ నిబంధన పెనుభారంగా మారింది. ఏ ప్రభుత్వమైనా.. ఇచ్చే సామాజిక భద్రత పెన్షన్లు.. అపన్నులకు ఎంతో ఆసరాగా ఉంటాయి. ప్రధానంగా వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, చెప్పులు కుట్టే కార్మికులు, పక్షవాత రోగులతో పాటు సుమారు 26 రకాల వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు అందజేస్తుంది. ఈ పెన్షన్ల వల్ల కుటుంబంలో ఇతరుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకుండా.. ఉపశమనం పొందుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెట్టిన నిబంధనలతో గత కొన్ని సంవత్సరాలుగా.. జిల్లాలో పలువురు ఆపన్నులు పెన్షన్లను పొందలేకున్నారు. ఐదెకరాల పొలం అనే నిబంధనతో పెన్షన్లు రాక కొందరు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జీవిత చరమాంకంలో ఉన్న వాళ్లకు ఈ పెన్షన్లు భరోసాగా ఉండేవి. అయితే జగన్‌రెడ్డి ప్రభుత్వం గతంలో పెన్షన్ తీసుకుంటున్న వాళ్లకు సైతం ఈ నిబంధనను పెట్టి.. పెన్షన్‌ను నిలుపుదల చేసింది. భూములు ఉన్నా వాటిని సాగు చేసే వాళ్లు లేక... సాగు చేసినా పంటలు పండక.. బీళ్లుగా వదిలేశామని ప్రభుత్వం మాత్రం ఐదు ఎకరాల కంటే.. పొలం ఎక్కువ ఉందనే కారణంతో.. తమకు పెన్షన్ ఇవ్వకపోవడం దారుణమని వాపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమపై దయవుంచి.. ఈ నిబంధనను ఎత్తివేయాలని బాధితులు కోరుతున్నారు.

వికలాంగ పెన్షన్ ఇవ్వలేదు..



తెలుగుదేశం ప్రభుత్వంలో నాకు వికలాంగ పెన్షన్ రూ.5 వేలు, నా భార్యకు అభయహస్తం పెన్షన్ రూ.2 వేలు వచ్చేది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఏడాదికే నా భార్యకు పెన్షన్‌ను తొలగించారు. మూడో ఏడాది నాకు కూడా తొలగించారు. వ్యవసాయ భూమి ఐదు ఎకరాలకు మించి ఉందనే కారణంతో పెన్షన్లను తొలగించారు. భూములు ఉన్న మాట వాస్తవమే. అయితే వాటిని సాగు చేసే వాళ్లు లేక..బీళ్లుగా వదిలేశాము. చంద్రబాబు మాపై దయ చూపాలి.

- వెంకటయ్య, చిన్నమండెం

పేరుతో భూమి లేకున్నా పెన్షన్ నిలిపేశారు..



నాకు 69 సంవత్సరాలు. కొన్ని సంవత్సరాలు వృద్ధాప్య పెన్షన్ వచ్చింది. తర్వాత ఐదు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉందనే కారణంతో పెన్షన్‌ను నిలిపేశారు. వాస్తవానికి నా పేరు మీద సెంటు భూమి కూడా లేదు. నా భర్త వెంకటరమణ పేరు మీద ఐదు ఎకరాల పొలం ఉండడంతో.. నాకు పెన్షన్‌ను నిలిపేశారు. కొడుకులు విడిగా ఉంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న నాకు పెన్షన్ ఇచ్చి ఉంటే.. ఎంతో ఆసరాగా ఉండేది.

- రామక్క బి.కొత్తకోట

వృద్ధాప్య పెన్షన్ ఇవ్వలేదు..



నాకు 11 ఎకరాలు ఉన్నా.. వ్యవసాయం గిట్టుబాటు కాక.. ఆర్థికంగా చితికి పోయాము. పంట పెట్టినా దిగుబడులు, గిట్టుబాటు ధరలూ లేవు. దీంతో భూములు బీళ్లుగా పెట్టాము. ఒక ఆవును మేపుకుంటూ.. పొలమ్ముకుని జీవనం సాగిస్తున్నాము. పెట్టుబడులు కూడా రాక.. సామాన్య రైతులు వ్యవసాయం చేయడానికే భయపడుతున్నారు. భూములున్నా... బతకడం కష్టంగా ఉంది. మావంటి రైతులకు అర్హతను బట్టి.. వృద్ధాప్య పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలి.

- ఎం.మల్లికార్జున, పెద్దమండెం

వచ్చే పెన్షన్‌ను ఆపేశారు..



గతంలో నాకు వితంతు పెన్షన్ వచ్చేది. ఐదు ఎకరాలకు పైగా పొలం ఉందనే కారణంతో.. జగన్ ప్రభుత్వం వస్తున్న పెన్షన్‌ను రద్దు చేశారు. పలుసార్లు సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా.. ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా.. ఫలితం లేదు. కొత్త ప్రభుత్వం ఆదుకోవాలి.

- నాగినేని నర్సమ్మ, రైల్వేకోడూరు



ప్రైవేటు వైద్యం బరువు

- కలగానే 30 పడకల ఆసుపత్రి
- కనీస వసతులు లేక రోగులు విలవిల
- ఐదేళ్లుగా మాటల గారడి

సుండుపల్లె, జూన్ 30: సుండుపల్లె మండలం ఓ మారుమూల ప్రాంతం. సుమారు లక్షకు పైగా జనాభా కలిగిన మండలంలో సరైన వైద్యం అందక నిరుపేద కుటుంబాలు వేల రూపాయలు వెచ్చించి ప్రైవేటు వైద్యం పొందాల్సిన దయనీయ పరిస్థితి ఈ మండలంలో దాపురించింది. ఓవైపు మెడికల్ మాఫియా ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తోంది. 14 గ్రామ పంచాయతీల్లో 261 పల్లెల నుంచి ప్రజలు నిరంతరం మండల కేంద్రానికి పలు రోగాలతో వచ్చే పరిస్థితి ఉన్నా ప్రభుత్వ వైద్యం రోగులకు అందని ద్రాక్షలా మారిందని మండల ప్రజలు లబోదిబోమంటున్నారు. సుండుపల్లెలో నేడో రేపో 30 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేస్తామని వైసీపీ పాలనలో ఎమ్మెల్యే, ఎంపీలు గాలిమాటలు చెప్పడం తప్ప వారి హామీలు నెరవేర్చిన పాపానపోలేదని మండల ప్రజలు వాపోతున్నారు. మళ్లీ 2019 ఎన్నికల సమయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు 30 పడకల ఆసుపత్రి వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పిన మాటలు నేటికీ నీటిపై రాతల్లానే మిగిలిపోయాయి. ఆసుపత్రిలో కనీసం ప్రసవాలు జరిగినా కూడా తల్లీబిడ్డతో పాటు ఇతర రోగులు ఉండలేని దయనీయస్థితి సుండుపల్లె ప్రభుత్వ వైద్యశాలలో దాపురించింది. ఏనాడైనా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధిని పట్టించుకోలేదు. ఉన్న వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచుకునే పరిస్థితి ఇక్కడ కనిపించడం లేదు. వైద్యులు ఏదో అత్తారింటికి వచ్చినట్లు వచ్చి తమకు కేటాయించిన రూముల్లో కూర్చుని ఒకరిద్దరికి వైద్యం చేసి ఇంటికి వెళ్లిపోతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. వైద్యశాల నిర్వహణ కోసం నిధులు రావడం లేదా, వస్తే ఆ నిధులు ఏమవుతున్నాయి, కనీస వసతులు సమకూర్చుకోలేరా అని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దయనీయంగా రోగుల గది

సుమారు లక్ష జనాభా కలిగిన సుండుపల్లి మండలంలో అనేక మంది ప్రతిరోజూ వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారు. ఆసుపత్రిలో కనీస వసతులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోగులను ఉంచే గది దయనీయంగా మారింది. కనీసం ఆ గదిని వారానికి ఒకసారైనా శుభ్రపరుస్తారో లేదో తెలియదు. అదే గదిలో రోగులను ఉంచి సూదులు వేయడం, ప్రసవాలు జరిగితే తల్లీబిడ్డను ఉంచడం, ఏదైనా సమస్య వస్తే సెలైన్ బాటిల్స్ ఎక్కించడం వంటి పనులు చేస్తున్నారు. ఒకవైపు దోమలు మరోవైపు చెత్తకు పనులు తలపించేలా గది ఉండడంతో చాలా మంది వైద్యం కోసం ఆసుపత్రికి రావడం లేదు. ఒకే ఒక గది రోగుల కోసం కేటాయించారు. ఆ గదిలో నాలుగు బెడ్లు ఉండగా వాటి మీద కనీసం దుప్పట్లు సైతం కనిపించడం లేదు.

బోరు పాడైపోయి.. మరుగుదొడ్లకు తాళాలు

వైద్యశాలలో ఉన్న బోరు పాడైపోవడంతో మరుగుదొడ్లకు తాళాలు వేశారు. రోగులు, వైద్యులు మరుగుదొడ్లు వినియోగించాల్సి వస్తే వారి పరిస్థితి దయనీయంగా ఉంది. నీటి కొరత వల్ల అన్ని మరుగుదొడ్లకు తాళాలు వేశారు. వైద్యులు వారి అవసరాల నిమిత్తం ఎమ్మార్సీ భవనంలోకి పోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగుల పరిస్థితి అయితే వర్ణణాతీతం. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే సర్వే సమావేశంలో బోరు చెడిపోయింది, మరమ్మతులు చేయించండి అని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు చెప్పినా కూడా ఫలితం లేదని వైద్యులు చెబుతున్నారు. నీటి సమస్య పరిష్కరించాలని రోగులు, వైద్యులు కోరుతున్నారు.



దయనీయ పరిస్థితుల్లో రోగులకు వైద్యం అందించే గది

అవగాహనతో అతిసార నియంత్రణ

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య



రాయచోటి టౌన్, జూన్ 30: అతిసార నియంత్రణ అవగాహన ప్రచార కార్యక్రమాలను విజయవంతం చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు రెండు నెలల పాటు జిల్లాలోని అన్ని గ్రామాల్లో అతిసార వ్యాధి నియంత్రణపై అవగాహన ప్రచార కార్యక్రమాలు, నియంత్రణ చర్యలను అనుబంధ శాఖలతో సమన్వయం చేసుకుని నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో అనుబంధ శాఖాధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారని, ఆయా శాఖల వారు చేయాల్సిన విధులపై దిశానిర్దేశం చేశారని తెలిపారు. నేటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని అతిసార నియంత్రణపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వోలు నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి ఫలితాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, ఫలితాలు సాధారణంగా లేకుంటే సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అంతేగాక ఆశా, అంగన్వాడీ, ఏఎన్‌ఎంలు గృహ సందర్శనాలు నిర్వహించి 5 సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న ఇంటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో నిర్వహించే గ్రామీణ ఆరోగ్య పోషణ, పారిశుధ్య దినాల్లో పాల్గొనే తల్లులకు ఓఆర్ఎస్ ప్రాముఖ్యత ఎక్కడ లభిస్తాయి, ఎలా తయారు చేసుకోవాలనే అంశాలు, చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపీడీవో అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ సమావేశాలు నిర్వహించాలని, మండల స్థాయిలో స్వయం సహాయక బృంద సభ్యులకు, వీవోలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో అతిసార నియంత్రణపై అవగాహన కల్పించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు విద్యాశాఖతో కలిసి చేసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ నీటి పారుదల శాఖ వారితో కలిసి 104 సేవలకు కేటాయించిన మగ ఆరోగ్య కార్యకర్తలు ఓవర్‌హెడ్ ట్యాంక్స్‌ను శుభ్రం చేయించడం, ప్రతిరోజూ ట్యాంక్‌లోకి నీళ్లు వదిలే వాటర్‌మ్యాన్‌తో కలిసి క్లోరినేషన్ లాగ్‌బుక్ నిర్వహించాలని సూచించారు. అలాగే పైపులైన్ లీకేజీలను, గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రమాదకర ఆరోగ్య పరిస్థితులు గుర్తించి పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడం వంటివి చేయాలని మగ ఆరోగ్య కార్యకర్తలను ఆదేశించారు. అందరం కలిసికట్టుగా పనిచేసి అతిసార వ్యాప్తిని అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడుదామని డీఎంహెచ్‌వో పిలుపునిచ్చారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 30: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అభిషిక్త్ కిశోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్‌లు, మండలాల ప్రజలు స్థానికంగా పరిష్కారం కాని వారి సమస్యలను తెలియజేచేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు రావాలని కలెక్టర్ తెలిపారు.

ఫేస్-2 వెబ్ ఆప్షన్స్‌కు షెడ్యూల్ విడుదల

రాయచోటిటౌన్, జూన్ 30: ఉమ్మడి కడప జిల్లాతో పాటు రాష్ట్ర స్థాయిలో డీఈడీ సెట్ క్వాలిఫై అయిన విద్యార్థులందరూ జూన్ 30వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకు సెకండ్ స్పెల్ వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని రాయచోటిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీట్ అలాట్‌మెంటు జూలై 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉంటుందని, 8వ తేదీ ఏ డైట్‌లో సీట్ వచ్చిందో తెలియజేసి అలాట్‌మెంటు లెటర్ వస్తుందని తెలిపారు. అలాగే 9వ తేదీ నుంచి 13 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సంబంధిత డైట్‌లలో హాజరుకావాలని ప్రిన్సిపాల్ వివరించారు.

అమ్మే నా తొలి గురువు

- ఆమె ఆశీస్సులతోనే ఈ స్థాయికి
- తల్లి రిటైర్‌మెంట్ సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ భావోద్వేగం


తిరుపతి(కలెక్టరేట్), జూన్ 30: అమ్మే నా తొలి గురువు.. నేను బుడిబుడి నడకలు వేసే సమయంలో నా వేలు పట్టుకుని పాఠశాలకు తీసుకెళ్లింది.. ఈరోజు నేను ఓ ఐఏఎస్ అధికారిగా మీముందు ఉన్నానంటే ఆమె ఆశీస్సులతోనే ఈ స్థాయికి ఎదిగానని తన తల్లి జయభారతి పదవీ విరమణ సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ భావోద్వేగానికి గురయ్యారు. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల సంస్థ చిత్తూరు జిల్లా సమన్వయకర్త జయభారతి ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా తిరుపతి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె కుమారుడు, అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేడు ఉన్నత స్థాయిలో కలెక్టర్‌గా ఉన్నానంటే అందుకు తన తల్లే కారణమని, నేను చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించానని, నాకు విద్య చెప్పిన ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమానికి హాజరవడం సంతోషకరమన్నారు. ఈ ప్రభుత్వంలో నేను కలెక్టర్‌గా.. తల్లి జయభారతి ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ పొందడం ఆనందంగా ఉందన్నారు. చిన్న వయసు నుంచి తల్లిదండ్రుల క్రమశిక్షణ చూసి విజయం ఎలా పొందాలి.. ఎలా సాధించాలి అనేది నేర్చుకున్నానని.. నా ప్రతి అడుగు విజయం వెనుక తల్లి జయభారతి ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. తిరుపతి ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ గురుకుల పాఠశాల సంస్థ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త జయభారతి సేవలు ఎనలేనివన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరై ఆమెను ఘనంగా సన్మానించారు.



పదవీ విరమణ సందర్భంగా తన తల్లిని సన్మానిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

భావి భారత క్రికెటర్లు

- చిన్నారులను క్రికెటర్లుగా తీర్చిదిద్దుతున్న వీసీసీ
- లక్ష్యం దిశగా గ్రామీణ క్రీడాకారుల సాధన



వాల్మీకిపురంలో శిక్షణ ఇస్తున్న మదనపల్లె డివిజన్ కోచ్ సునీల్‌కుమార్

వాల్మీకిపురం, జూన్ 30: ప్రస్తుతం ఎటు చూసినా క్రికెట్ ఫీవరే కనిపిస్తోంది. చిన్న చిన్న గల్లీల్లో సైతం చిన్నారులు క్రికెట్ ఆడుతూ సందడి చేస్తున్నారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన క్రికెట్ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకూ పాకింది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ నైపుణ్యంతో పైకి ఎదిగి క్రికెట్‌లో అందరి మన్ననలు పొందుతున్నారు. ఉన్న అరకొర వనరులను సద్వినియోగం చేసుకుని చిచ్చర పిడుగుల్లా గ్రామీణ క్రీడాకారులు దూసుకుపోతున్నారు. వాల్మీకిపురంలో రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైన వాల్మీకిపురం క్రికెట్ క్లబ్ (వీసీసీ)ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ జిల్లా క్రికెట్ సబ్ సెంటర్‌గా గుర్తించింది. దీంతో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, జిల్లా అసోసియేషన్ ఈ సబ్‌సెంటర్ తరపున క్రికెట్ శిక్షకుడిని సైతం నియమించి గ్రామీణ క్రీడాకారులకు క్రికెట్‌లో అత్యుత్తమ శిక్షణ ఇస్తోంది. బీసీసీఐ-ఎన్‌సీఏ లెవల్-1 కోచ్‌గా ఉన్న సునీల్‌కుమార్ ఇక్కడ క్రీడాకారులకు క్రికెట్‌లో ప్రత్యేకంగా తనదైన శైలిలో శిక్షణ ఇస్తున్నారు.

రాష్ట్రస్థాయిలో క్రీడాకారులు

ఇక్కడ శిక్షణ పొందిన చాలామంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. అందులో కె.దీపన్‌సాయి అండర్-14లో ఆల్‌రౌండర్‌గా మంచి ప్రతిభ కనబరచి సీనియర్ జోన్‌తో పాటు రాష్ట్ర స్థాయి క్రికెట్‌లో సత్తా చాటుతున్నాడు. అలాగే ఎం.రుక్సార్ తబస్సుమ్ పేస్ బౌలర్‌గా అండర్-15 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై మంచి ప్రతిభ చాటుతోంది.

ఎవరెవరు వస్తారంటే..

జిల్లాలోని మదనపల్లె, వాల్మీకిపురం, పీలేరు, కలకడ, కలికిరి, గుర్రంకొండ, తంబళ్లపల్లె తదితర మండలాలతో పాటు చిత్తూరు జిల్లాలోని పుంగనూరు తదితర మండలాల నుంచి క్రీడాకారులు ఇక్కడ శిక్షణ పొంది మంచి క్రీడాకారులుగా తయారవుతున్నారు. ఇప్పటికే వీరు అండర్-12, అండర్-14లలో రాణించి, అండర్-16 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికవ్వడమే లక్ష్యంగా కొంతమంది ముందుకెళ్తుంటే, మరి కొంతమంది జూనియర్ క్రీడాకారులు అండర్-14 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికవ్వడమే లక్ష్యంగా దూసుకుపోతున్నారు.





రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైన దీపన్‌సాయి, రుక్సార్ తబస్సుమ్

ఆంధ్రా జట్టుకు ఎంపికవ్వడమే లక్ష్యం..



అండర్-19, 17 స్కూల్ గేమ్స్‌లో ఆడి రాణించా. అండర్-19 చిత్తూరు జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలో ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యా. ఇక్కడ అత్యంత ప్రతిభ చూపి జిల్లా జట్టు స్టాండ్‌బైగా ఎంపికయ్యా. భవిష్యత్తులో ఆంధ్ర క్రికెట్ జట్టుకు ఎంపికవ్వడమే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నా. వాల్మీకిపురం క్రికెట్ సబ్ సెంటర్‌లో చక్కటి మెలకువలు నేర్పిస్తున్నారు. ఇక్కడ సాధనతో మరింత రాటుదేలుతున్నాం.

- ఎండీ సిరాజ్, మీడియం పేస్‌బౌలర్, మదనపల్లె

అండర్-14లో స్థానమే ధ్యేయం..



జిల్లా క్రికెట్ సబ్ సెంటర్ క్యాంపుల్లో శిక్షణ పొంది మంచి క్రీడాకారుడిగా గుర్తింపు పొందాను. డివిజన్ స్థాయి క్రికెట్‌లో రాణించి విశేష ప్రతిభ కనబరిచి అండర్-14, 17 స్కూల్ గేమ్స్ జట్టుకు ఎంపికై రాణించాను. గత ఏడాది అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపికై మంచి ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ క్రికెట్ జట్టుకు స్టాండ్‌బైగా ఎంపికయ్యాను. అండర్-16 ఆంధ్ర క్రికెట్ జట్టుకు ఆడాలని శిక్షణ పొందుతున్నా.

- ధనుశ్, ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్, కలికిరి

ప్రతిభ ఆధారంగా ఎంపికలు..



మనలోని ప్రతిభను బట్టే ఎంపికలు ఉంటాయి. గత ఏడాది అండర్-14 క్రికెట్ జిల్లా జట్టుకు ఎంపికై విశేష ప్రతిభ చూపి అండర్-14 సౌత్‌జోన్ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాను. ఇక్కడ కూడా ప్రతిభ చూపి అండర్-14 ఆంధ్ర ప్రాబబుల్స్ క్రికెట్ జట్టుకు ఆడాను. ఈ ఏడాది అండర్-14 ఆంధ్ర క్రికెట్ జట్టుకు ఎంపికవ్వడమే లక్ష్యంగా వాల్మీకిపురంలో శిక్షణ తీసుకుంటున్నా. ఇది ఎంతగానో ఉపయుక్తంగా ఉంది.

- దినేశ్, ఆఫ్ స్పిన్ బౌలర్, కలికిరి

సాధనతోనే అవకాశాలు..



వాల్మీకిపురంలోని జిల్లా క్రికెట్ సబ్ సెంటర్‌లో క్రికెట్‌లో శిక్షణ పొందుతూనే అండర్-19 చిత్తూరు జిల్లా ప్రాబబుల్స్‌కు ఆడా. రాబోయే రోజుల్లో యూనివర్సిటీ క్రికెట్ జట్టులో స్థానం సాధించడమే లక్ష్యంగా వాల్మీకిపురంలో క్రికెట్ శిబిరంలో శిక్షణ పొందుతున్నా. క్రీడాకారులకు నిరంతర సాధన అవసరం. అప్పుడే అవకాశాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి.

- దివాకర్‌యాదవ్, బ్యాట్స్‌మెన్, పుంగనూరు

రెండేళ్లుగా నిరంతర శిక్షణ..



వాల్మీకిపురంలోని జిల్లా క్రికెట్ సబ్‌సెంటర్ క్యాంపులో శిక్షణ పొంది బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నా. రెండేళ్లుగా ఇక్కడ క్రికెట్ శిబిరంలో శిక్షణ పొందుతున్నా. రాబోవు రోజుల్లో జిల్లా అండర్-12, అండర్-14 క్రికెట్ జట్లకు ఎంపికవ్వడానికి శిక్షణ తీసుకుంటున్నా. మంచి క్రికెటర్‌గా గుర్తింపు పొందాలన్నదే నా ఆశయం. ఆల్‌రౌండర్‌గా రాణించాలని సాధన చేస్తున్నా.

- భువనసాయి చంద్రకుమార్, బ్యాట్స్‌మెన్, వాల్మీకిపురం

చేపలవేటపై నిఘా కమిటీ ఏర్పాటు

కొండాపురం, జూన్ 30: నేటి నుంచి ఆగస్టు 31 వరకు నిషేధించిన చేపలవేటపై నిఘా కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉప మత్స్య సంచాలకులు కె.శాంతి, మత్స్యశాఖ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని గండికోట, బ్రహ్మసాగర్, సోమశిల వెనుకజలాల్లో చేపలవేట జరగకుండా పర్యవేక్షణ చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మత్స్య, పోలీసు, రెవెన్యూ, మార్కెటింగ్, అటవీశాఖల సిబ్బందితో చేపల సంరక్షణ కోసం నిఘా కమిటీ పని చేస్తుందన్నారు. కావున ఈ 62 రోజుల సమయంలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లకూడదన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి వెళితే చర్యలు తప్పవని వారు ఒక ప్రకటనలో హెచ్చరించారు.

మిలిటరీ అక్రమ మద్యం బాటిళ్లు పట్టివేత...!

ముద్దనూరు జూన్30: పులివెందుల రోడ్డులోని మల్లేల ఘాట్ వద్ద బస్సులో అక్రమ మిలిటరీ మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఒకరిని శనివారం ముద్దనూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... బెంగుళూరు నుంచి ఒకరు మిలిటరీ మద్యం బాటిళ్లను కొందరు వ్యక్తులకు ప్రతి నెలా అక్రమంగా విక్రయిస్తుంటాడు. నల్లబల్లె వైసీపీకి చెందిన వ్యక్తికి చేరవేసేందుకు దాదాపు 80 మిలిటరీ మద్యం బాటిళ్లు సంచుల్లో తీసుకుని వస్తుండగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు దాడి చేసి పట్టుకుని మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే రెండు రోజులుగా దాడి కేసు నమోదు చేయనట్లుంది. ఈవిషయంపై వివరణ కోరేందుకు ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయం వద్దకు ఆంధ్రజ్యోతి విలేకరి వెళ్లగా అక్కడ ఉన్న సిబ్బంది తనకు అక్రమ మద్యం బాటిళ్ల విషయం తెలియదన్నారు. వెంటనే సీఐ, ఎస్ఐలకు ఫోన్ చేసినా వారు స్పందించలేదు, తరువాత కొద్ది సేపటికి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. మిలిటరీ అక్రమ మద్యం బాటిళ్లు మండలంలో చాలా చోట్ల ఒక్కో ఫుల్ బాటిల్ రూ.2500 నుంచి 3000ల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

ఓటీపీనా... అంటే....?

- రోగులకు తలనొప్పిగా మారిన వైనం
- మొబైల్ తప్పనిసరి
- ఓపీలో రోగుల ఇక్కట్లు
- నిర్లక్ష్యం చేస్తున్న సిబ్బంది



రక్తపరీక్షల ల్యాబ్‌లో కిటకిటలాడుతున్న రోగులు - రోగులకు ఓటీపీ అడిగి సీట్లు రాస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, జూన్ 30: ఓటీపీ అంటే కూడా తెలియని రోగులను ఓటీపీ చెప్పాలని ఆస్పత్రి వర్గాలు పలురకాల ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లేవారు నిరుపేదలు. వారికి కనీస పరిజ్ఞానాన్ని కూడా గుర్తించలేరు. వారిని ఓటీపీ అనడిగితే ఏమని చెప్తారు. రెక్కాడితే గానీ డొక్కాడని స్థితిలో ఉన్నవారికి మొబైల్ తప్పనిసరంటూ చెప్పడంతో ఓపీలో రోగులు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారు. ఆస్పత్రిలో రోగులపట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రోగుల పట్ల నర్సింగ్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు రోగులు వాపోతున్నారు. వివరాల్లోకెళితే.....

జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం రోగులు రావాలన్నా తలనొప్పిగా మారిందని వాపోతున్నారు. ఒకవైపు ఆస్పత్రిలో నిర్లక్ష్యం, మరోవైపు ప్రతి రోగికి ఓపీలో ఓటీపీ చెబితేనే చీటీలు రాస్తారని రోగులు వాపోతున్నారు. లేనిపోని నిబంధనలు పెట్టి రోగులకు అధికారులు ఇబ్బంది కలిగిస్తున్నారని వాపోతున్నారు. సమీప గ్రామాల నుంచి వివిధ జబ్బులతో వచ్చిన ప్రతి రోగికీ గతంలో ముందుగా ఓపీలో పేరు రాసుకుని చీటీ ఇచ్చేవారు. ప్రస్తుతం సెల్ ఉన్న రోగి మాత్రమే ఓపీకి వెళ్లి ఫోన్ నంబరు చెబితే ఓటీపీ వారి సెల్‌కు వస్తుంది. ఆ ఓటీపీ సిబ్బందికి చెబితే చీటీ రాసి ఇస్తారు. కొందరు వృద్ధులు, కంటిచూపు సరిగా లేని వారు సెల్ ఓటీపీ తమకు తెలియదని, అక్కడే వాపోతున్నారు. దీంతో తాము చేసేది ఏమీ లేదని అధికారులే ఈ విధంగా నిబంధన పెట్టినట్లు సిబ్బంది రోగులకు చెబుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులైన జ్వరాలు, వల్లు నొప్పులు తదితర ఇబ్బందులతో రోగులు ఆస్పత్రిలో రక్త పరీక్షల ల్యాబ్‌లో కిటకిటలాడుతున్నారు. ఓపీలో ఓటీపీ నిబంధన రద్దు చేయాలని, రోగులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీ గది వద్ద మృతదేహాలను భద్రపరిచే విషయంలో కానీ, విధుల్లో అక్కడున్న సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో కొన్నేళ్లుగా ఫెవికాల్ వీరులున్నారని, వారికి బదిలీ నిబంధనలు వర్తించనట్లుగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. రాజకీయ నేతల పలుకుబడితో ప్రభుత్వ ఆస్పత్రిలోనే తిష్టవేసినట్లుగా తెలుస్తోంది. అలాంటి వారిని గుర్తించి పనిచేసే ఉద్యోగులను మాత్రమే పెట్టుకోవాలని పలువురు రోగులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ఆస్పత్రిలో పనిచేయని సిబ్బందిని బదిలీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి

రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు సుభాషిణి

కమలాపురం రూరల్, జూన్ 30: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి కోరారు. కమలాపురంలో యూనియన్ నియోజకవర్గ అధ్యక్షురాలు కె.వరలక్ష్మి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో జరిగిన అనేక బహిరంగసభల్లో సీఎం చంద్రబాబు కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేస్తానని, ఉద్యోగ భద్రత కల్పిస్తానని వాగ్దానం చేసిన దాన్ని తక్షణం అమలు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో ఆశా కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆందోళనలకు స్పందించి రికార్డులు చేస్తామని ఆశా మరణిస్తే మట్టి ఖర్చు రూ.20 వేలు ఇస్తామని సాధారణ సెలవులు, మెటర్నరీ సెలవులు ఇస్తామని చెప్పి ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పి చేయలేదన్నారు. ఆశాల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి సమస్యలు పరిష్కరించాలని లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలకు శ్రీకారం చుడతామని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మరియమ్మ, కల్పన, కోశాధికారి అమ్ములు, జిల్లా ఉపాధ్యక్షులు అనసూయ, నియోజకవర్గ నేతలు సుధారాణి, అనిత, నాగలక్ష్మి, సుబ్బమ్మ, లక్ష్మిభవాని నారాయణమ్మ, జయకుమారి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జూన్ 30: గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు వచ్చారు. అమ్మ వారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కు లు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో ఆలయానికి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి.



ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ తల్లి

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ప్రదర్శన ఇస్తున్న మానస బృందం

పులివెందుల రూరల్, జూన్ 30: స్థానిక ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. పరిపాలన అధికారి సుధాకర్ పర్యవేక్షణలో ధర్మవరం వాసి మానస నృత్య కళాకేంద్రం బృందం ఈ నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, నంది అవార్డు గ్రహీత మానస తన బృందంతో శాస్త్రీయ, సినిమా పాటలకు చేసిన నృత్యం సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సందర్శకులకు ఏటీ, అవార్డు గ్రహీత మానస కృతజ్ఞతలు తెలిపారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి

ధర్మసూక్తులు వినిపించిన బ్రహ్మకుమారీలు



శిల్పారామంలో అలరించిన చిన్నారుల నృత్యాలు

కడప (కల్చరల్), జూన్ 30: నగర పరిధి శిల్పారామంలో ఆదివారం సాయంత్రం చిన్నారులు సందడి చేశారు. సాంస్కృతిక కళావేదిక మీద మిస్బా మూవీ ఆధ్వర్యంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కావ్య అక్కయ్య వారిచే ధర్మసూక్తులను ప్రేక్షకులకు వినిపించారు. అనంతరం విజయశాంతి ముద్ర డ్యాన్స్ అకాడమీ వారు పల్లె జానపద, శాస్త్రీయ నృత్యాలు, సినీ గీతాలకు చిన్నారులు తమ బుడి బుడి నడకలతో ప్రేక్షకులను అలరింపజేశారు.

స్కూటీ నడిపే బాలుడికి డీఎస్పీ కౌన్సెలింగ్

మైనర్ డ్రైవింగ్ అరికట్టాలని ఆదేశాలు : డీఎస్పీ



బాలుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు, జూన్ 30: మైనర్లు బైక్ డ్రైవింగ్ చేయడాన్ని అరికట్టాలని డీఎస్పీ మురళీధర్ పోలీసులను ఆదేశించారు. ఆదివారం గాంధీరోడ్డుపై 12 ఏళ్ల బాలుడు ముగ్గురు చిన్న పిల్లలను ఎక్కించుకుని డ్రైవింగ్ చేస్తుండగా డీఎస్పీ మురళీధర్ వారిని నిలిపి కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలను కానిస్టేబుల్‌తో అదే బైక్ పై ఇంటి వద్ద వదిలేయమని పంపి, తల్లి దండ్రులను తీవ్రంగా మందలించారు. పిల్లలకు బైక్‌లు ఇచ్చి రోడ్లపైకి వదిలితే జరిమానాలు విధిస్తామన్నారు. తల్లి దండ్రులే పిల్లలకు బైక్‌లు ఇచ్చి ప్రొత్సహించడం సరికాదన్నారు. మైనర్లు ఎవరైనా డ్రైవింగ్ చేస్తూ పట్టుపడితే తల్లిదండ్రులకు జరిమానాలు విధించాలన్నారు. ప్రమాదాలు జరిగాక బాధపడడం కంటే ముందుగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు ప్రత్యేక డ్రైవ్ పెట్టి పిల్లలు డ్రైవింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సులేని వారిని పట్టుకోవాలన్నారు. వాహనాలకు ఆర్‌సీ ఇతర గుర్తింపు పత్రాలు లేకుంటే సీజ్‌చేయాలన్నారు.

వక్కిలేరులో ఆక్రమణలు



ఆక్రమణలకు గురైన వక్కిలేరు

ఖాజీపేట, జూన్ 30: కొన్నేళ్లగా వక్కిలేరు వంకలో ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎక్కడైనా కొద్దిమేర స్థలం కనపడితే వైసీపీ నేతలు, వారి అనుయాయులు ఆక్రమించడం మొదలు పెట్టారు. మరికొందరు వంకలను సైతం పది అడుగుల మేర వంకను ఆక్రమించుకున్నారు. వివరాల్లోకెళితే... మండల పరిధి సుంకేసుల, బీచువారిపల్లెల్లోని పొలాలకు దాదాపు 800 ఎకరాలకు సాగునీరందేది. అయితే వైసీపీ ప్రభుత్వంలో కాల్వలు కొందరు ఆక్రమించుకోగా పూడికలు తీసేందుకు ఆదారిన వెళ్లకపోవడంతో దాదాపు పదేళ్లగా నీరు అందక రైతులు కష్టపడ్డారు. రైతన్నలు ఏమీ చేయలేక వర్షాధార పంటలు సాగు చేసి అరకొర పండించుకునేవారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి



రవీంద్ర మృతదేహం

కొండాపురం, జూన్ 30: చౌటిపల్లె యువకుడు రవీంద్ర (32) ఆదివారం రైలు కింద పడి మృతి చెందాడు. ఇతను మద్యానికి బానిసై, మనస్థాపానికి గురై అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని చల్లవారిపల్లె రైల్వే స్టేషన్ వద్ద రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఇతనికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.

ఇసుక వాహనాలు సీజ్



సీజ్‌చేసిన ఇసుక టిప్పర్లు, లారీలు

ఎర్రగుంట్ల, జూన్ 30: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలు, ఒక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. అంకన్నగారి పల్లె వద్ద ఎలాంటి పర్మిట్లు లేకుండా శనివారం రాత్రి మైదుకూరుకు చెందిన వారు రెండు లారీలు, ఒక టిప్పర్‌లో ఇసుకను లోడ్ చేసుకుని నంద్యాలకు తరలిస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. వాటిని సీజ్ చేసి, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కడపలో కేరళ పోలీసులు

దొంగను అదుపులోకి తీసుకున్న వైనం

కడప (క్రైం), జూన్ 30: వైజాగ్‌కు చెందిన ఓ వ్యక్తి కేరళలో దొంగతనం చేసి కడపలో తలదాచుకున్నాడు. దీంతో కేరళ పోలీసులు ఆదివారం చిన్నచౌకు ప్రాంతంలో ఉన్న ఆ దొంగను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. వైజాగ్‌లోని గాజువాకకు చెందిన సత్తిబాబు పలు పేర్లతో కేళర రాష్ట్రంలో పలు చోరీల్లో నిందితుడు. కడప చిన్నచౌకు ప్రాంతానికి చెందిన ఫోన్ కాంటాక్ట్‌లో ఆ పోలీసులు గుర్తించారు. అయితే నిందితుడు బెంగుళూరు నుంచి కడప ఆర్టీసీ బస్టాండుకు రాగా కేరళ పోలీసులు నిఘా పెట్టి బస్టాండులోనే అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు సత్తిబాబును కేరళ పోలీసులు అదుపులోకి తీసుకుని వెళ్లినట్లు సమాచారం.

చాలీ చాలని గదులు - చెట్లకిందే చదువులు



నిధుల లేమితో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం - చెట్లకిందే విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులు

బద్వేలుటౌన్, జూన్ 30: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌స్థాయి విద్యను అందిస్తామంటూ వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి అదనపు భవనాలను నిర్మించుకునేందుకు నాడు - నేడు పనులకు శ్రీకారం చుట్టింది. అయితే పాఠశాలల్లో చేస్తున్న పనులకు నిధులు విడుదల కాకపోవడంతో నత్తేనయం అన్నరీతిలో పనులు సాగాయి. నిధులు వృధా అయినా పర్వాలేదు, చేసినా, చేయకపోయినా మన పేరు మాత్రం కనపడాలి, హడావిడి చేయాలి, ఆర్భాటం ఉండాలి ఇదీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ తీరు. అందుకే వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనులు కొనసాగలేదు. అది రోడ్డుఅయినా, పాఠశాల భవనమైనా, సచివాలయాలైనా అన్నీ అరకొర పనులు మాత్రమే చేసి హంగూ ఆర్భాటాలతో ప్రచారాలు చేసుకోవడమే తప్ప పనులు చేసిన పాపాన పోలేదు. కేంద్రం నిధులతో చేపట్టిన సుమారు 70శాతం పనులు పూర్తి అయినా పాఠశాల భవనాలకు కొద్దిమాత్రమే నిధులివ్వడానికి వైసీపీ ప్రభుత్వానికి చేతులు రాలేదు. విద్యార్థులు చాలీ చాలని తరగతి గదుల్లో ఉండలేక చెట్లనీడనే ఉపాధ్యాయులు పాఠాలు చెబుతుండడం విశేషం.

వందేళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన బద్వేలు బాలుర ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు నత్తనడకన సాగుతున్నాయి. 21 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.2.36కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ పాఠశాలలో 1780 మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుకుంటున్నారు. 50 మందికిపైగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇంటర్‌విద్యను కూడా ఇదే పాఠశాలలో అందిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు అందుబాటులో లేకపోవడంతో చెట్లకిందే కుర్చీపెట్టి ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. మొత్తం 41సెక్షన్లు ఏర్పాటు కావాల్సి ఉండిగా 31 సెక్షన్లకు కుదించారు. దీంతో ఇరుకైన తరగతి గదుల్లో కూర్చుని ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో తరగతి గదికి 4 నుంచి 6 సెక్షన్లు చేశారు. విద్యార్థుల అరుపులు, ధ్వనులు తప్ప ఉపాధ్యాయులు చెప్పేది విన్పించక ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణానికి అవసరమైన సామగ్రి సకాలంలో రాకపోవడంతో పనులు ముందుకు చురుకుగా సాగడంలేదు. ఇక్కడ చదివే విద్యార్థులంతా ఎక్కువగా బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో ఉంటున్నారు. జిల్లాలోనే పాఠశాలకు వందేళ్ల చరిత్ర ఉండి, విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్నదిగా గుర్తింపు పొందింది. ఇప్పటికైనా భవన నిర్మాణ పనులు పూర్తి అయితే విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకుని వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిధుల కొరతతోనే పనులు చేపట్టలేకపోయాం

పాఠశాలలో నాడు-నేడు పనులు నిధులులేక ఆగిపోయాయని, త్వరితగతిన నిధులు విడుదల చేస్తే భవన నిర్మాణ పనులు పూర్తిచేసి విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో పాఠాలు చెప్పుకుంటాం.

జి.వెంకటసుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, బాలుర ఉన్నత పాఠశాల

పోలేరమ్మా చల్లగా దీవించమ్మా



కోట పోలేరమ్మ దేవాలయానికి ఊరేగింపుగా వెళుతున్న తంబాబావివీధి వాసులు



బోనాలతో వెళుతున్న కప్పలపల్లె మహిళలు

పోరుమామిళ్ల, జూన్ 30: కోటపోలేరమ్మా.. చల్లగా దీవించమ్మా అని పోరుమామిళ్లలోని తంబాబావివీధి వాసులు, పెద్దకప్పలపల్లె గ్రామస్తులు పేర్కొన్నారు. ఆదివారం తంబాబావి వీధి వాసులు కోటపోలేరమ్మకు కుంకుమబండితో, బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కప్పలపల్లె మహిళలు కోట పోలేరమ్మ దేవాలయం వరకు పొలాల గుండా భక్తిపారవశ్యంతో బోనాలను తీసుకెళ్లి ఆమెకు సమర్పించారు. కొందరు మహిళలు భక్తిపారవశ్యంతో చిందులు వేశారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి తమ పంటలు పండేలా చూడాలని అన్ని చెరువులకు నీళ్లు వచ్చేలా ఆశీర్వదించాలని కోరారు. పోరు మామిళ్లలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్ పాల్గొన్నారు.

'యోగివేమన'కు పట్టిన శని విరగడైంది

- టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వేమన విగ్రహానికి క్షీరాభిషేకం

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 30: వైవీయూ వర్సిటీకి పట్టిన శని విరగడైందని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేశ్ తెలిపారు. ఆదివారం వైవీయూలో యోగివేమన విగ్రహానికి క్షీరాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ అధినేత జగన్ బంధువులు విశ్వవిద్యాలయాన్ని భ్రష్టు పట్టించారన్నారు. ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రారుగా ఉన్న వీసీ సురేంద్రనాథరెడ్డి ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లు ఈ రెండు యూనివర్సిటీల్లో పాలన కుంటుపడిందన్నారు. ప్రభుత్వం మారడంతో వైసీపీకి అంటకాగిన వీసీ, రిజిస్ట్రార్లు అవినీతి భాగోతం బయటపడడంతో సమాధానమివ్వలేక తప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల్లో విభాగాల వారీ దొంగతనంగా ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. ఇలా ప్రతి విషయంలోనూ దోచుకుని యూనివర్సిటీలను భ్రష్టు పట్టించారని ఆరోపించారు. టీఎన్ఎస్ఎఫ్ నేతలు భరత్, లోకేశ్, విశ్వనాథ్, టీడీపీ నేతలు పి.డేవిడ్, అమృత్, అరవింద్ పాల్గొన్నారు.



వేమన విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు

కనపడితే సమాచారం ఇవ్వండి



ఖాజీపేట, జూన్ 30: ఇంటి నుంచి వెళ్లిపోయిన ఖైరీసా కనపడితే సమాచారం ఇవ్వాలని సీఐ రామాంజులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాజీపేట మండలం బాలనగర్ వాసి ఖైరీసా శనివారం డ్యూటీ నిమిత్తం కడపకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల వద్దకు వెళ్లి ఉండవచ్చని విచారించి కనపడకపోవడంతో ఆమె తమ్ముడు పృధ్వీరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని, ఈమె ఎక్కడైనా కనపడితే 9121100623 నంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

భూవివాదం - కేసులు నమోదు

బి.కొత్తకోట, జూన్30: కొత్తపల్లి వద్ద నెలకొన్న భూవివాదంలో ఇరువర్గాలపై వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తమకు హక్కుగల భూమిలో అక్రమంగా ప్రవేశించి పంటను ధ్వంసం చేశారంటూ బి.కొత్తకోటకు చెందిన మహిళ అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బి.కొత్తకోట సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు, వైసీపీ నేత తిరుమల అమరనాథ్‌తో పాటు ఆరు గురిపై కేసు నమోదు చేశారు. అదే విధంగా ఈ భూ వ్యవహారంలోనే వెంకట్రమణ ఫిర్యాదు మేరకు అరుణతోపాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు అదృశ్యం కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 30: యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వల్లీబసు తెలిపారు. కురబలకోట మండలం, కోనంగివారిపల్లె వాసి డి. వెంకటేష్ తన భార్యతో కలిసి 19న మదనపల్లెలో ఓ డాక్టర్ వద్దకు వచ్చి అనంతరం రీడింగ్ రూమ్‌వీధిలో షాపింగ్ కోసం వెళ్లారు. కాగా భార్యను అక్కడే వదిలేసి వెంకటేష్ అదృశ్య మయ్యాడు. కుటుంబీకులు బంధువులు, స్నేహితుల ఊర్లలో వెతికారు. కానరాకపోవడంతో వన్‌టౌన్ సీఐ యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చియ్యవరం కమ్మపల్లెలో గంగమ్మ జాతర



గంగమ్మకు పూజలు చేస్తున్న కస్తూరి

రైల్వేకోడూరు, జూన్ 30: మండలంలోని చియ్యవరం కమ్మపల్లెలో ఆదివారం గంగమ్మ జాతర నిర్వహించారు. వందలాది మంది భక్తులు పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. పొట్టేళ్లు, కోళ్లు సమర్పించుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేతకు కస్తూరి పరామర్శ

టీడీపీ నేత కట్టా బాలాజీకి కొంత కాలంగా అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారు. ఆదివారం ఆయన్ను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు తదితరులు పరామర్శించారు. కట్టా బాలాజీ త్వరగా కోలుకోవాలని వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కేజేపీ రెడ్డయ్య నాయుడు, రాజంపేట టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుల్లెల రమేష్‌బాబు, వాణిజ్య విభాగం కార్యదర్శి కస్తూరి శ్రీధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు మొక్కుల చెల్లింపు



మొక్కులు తీర్చుకుంటున్న వెంకటసుబ్బయ్య

రాయచోటిటౌన్, జూన్ 30: రాయచోటి ఎమ్మెల్యేగా విజయం సాధించిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి రావడంతో తెలుగుదేశం పార్టీ అభిమాని కడప వెంకటసుబ్బయ్య ఆదివారం రాయచోటి పట్టణంలోని వరిగ రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, రాయచోటి నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి విరాళం

చిట్వేలి, జూన్ 30: మండల పరిధిలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి కె.కందులవారిపల్లెకు చెందిన తుంగా అయ్యన్ననాయుడు కుమారుడు కన్యాకుమార్ రూ. 11,232 విరాళం ఇచ్చినట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త కట్టా రామ్మోహన్‌రావు ఆదివారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. దాతలు ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని ఆయన కోరారు.

హిందూధర్మం ఔన్నత్యంపై అవగాహన



హిందూధర్మంపూ అవగాహన కల్పిస్తున్న వాల్మీకి సంఘం నేతలు

సంబేపల్లె, జూన్ 30: కొన్ని మతాల వారు అమాయక ప్రజలను ప్రలోభపెట్టి మతమార్పిళ్లకు పాల్పడుతున్నట్లు వాల్మీకి సంఘం పెద్దలు తెలిపారు. ఆదివారం రౌతుకుంట గ్రామం బోయపల్లిలో ప్రజలకు హిందూ మత ఔన్నత్యాన్ని వివరించారు. మత మార్పిడులకు తెగబడుతున్న వారి మాటలు నమ్మవద్దని తెలియజేశారు. బోయపల్లి ప్రజలకు, వాల్మీకి సంఘం పెద్దలు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు బోయపల్లిలోని ప్రజలందరితో మాట్లాడారు. హిందూ మత ఔన్నత్యం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం పెద్దలు భక్తవత్సలం, వెంకటయ్య, బుజ్జిబాబు, సాయిప్రతాప్, అశోక్, మోహన్, రెడ్డిఆంజనేయులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీజీ లా సెట్‌లో రాయచోటివాసికి 599 ర్యాంకు

రాయచోటిటౌన్, జూన్ 30: రాయచోటి పట్టణానికి చెందిన బీసీ సంఘం నేత, హాకీ అకాడమీ సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు కమారుడు ఉత్తేజ్‌కుమార్‌రావు పీజీ లా సెట్‌లో 599 ర్యాంకు సాధించాడు. ఈయన ప్రస్తుతం రాయచోటి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నాడు. తల్లిదండ్రులతో పాటు బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

మంచం పట్టిన గ్రామాలు!

● పీడిస్తున్న డయేరియా! ● క్షీణించిన పారిశుధ్యం ● ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందని సేవలు ● ప్రైవేటును ఆశ్రయిస్తున్న బాధితులు

లక్కిరెడ్డిపల్లె జూన్ 30 : తాగునీటి కాలుష్యం, క్షీణించిన పారిశుధ్యం కారణంగా లక్కిరెడ్డి పల్లె మండల ప్రజలు 20 రోజులుగా డయేరియా బారిన పడి ఆస్పత్రులపాలవుతున్నారు. వైద్య సేవలు సరిగా అందక పోవడంతో ఆర్థికంగాను నష్టపోతున్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల వ్యాప్తంగా పారిశుధ్యం అధ్వానంగా మారింది. మండల కేంద్రంలోని రాయచోటి-వేంపల్లె మార్గంలోని ట్రాన్స్‌పార్మర్ వద్ద కుప్పలు కుప్పలుగా చెత్త దర్శనమిస్తోంది. ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద డ్రైనేజి నీరు నిలిచిఉండడంతో, దోమలు పెరిగిపోయాయని స్థానికులు వాపోతున్నారు ఈ మురుగుగుంటల్లో వైద్యసిబ్బందిగా నీ పంచాయతీ అధికారులు కానీ పిడికెడు బ్లీచింగ్ పౌడర్‌గానీ, బైటాక్స్ కానీ చల్లిన





చికిత్స పొందుతున్న బాధితులు



ఆర్‌టీసీ బస్టాండ్ వద్ద నిలచిన మురుగునీరు

పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. అనంతపురం, పందిళ్లపల్లె, మెయిన్ బజారుల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది గ్రామాల్లో పాలకవర్గాలు పారిశుధ్య చర్యలను పట్టించుకోక పోవడంతో బోర్లలోని నీరు కలుషితమై ప్రజలు విరేచనాలు, వాంతులతో మంచాన పడ్డారు. లక్కిరెడ్డిపల్లెలోని 30 పడకల కమ్యూనిటీ ఆసుపత్రిలో 8 మంది డాక్టర్లున్నా మధ్యాహ్నం 12 గంటలు దాటితే ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో ఉండరు. ఆ తర్వాత వచ్చిన రోగులను సిబ్బంది కడపకు రెఫర్ చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎలాంటి అర్హతలు లేని ఆర్ఎంపీ డాక్టర్లను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యంపై దృష్టి పెట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు కనీసం సాయంత్రం వరకు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

'మండిపల్లి'పై నిందలు మాని.. ఆత్మ విమర్శ చేసుకోండి

సంబేపల్లె, జూన్ 30 : రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై విమర్శలు మానుకుని, తమ ఓటమిపై ఆత్మ విమర్శ చేసుకోవాలని టీడీపీ నాయకుడు మడితాటి రవీంద్రరెడ్డి ఎంపీ మిధున్‌రెడ్డికి సూచించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గురివింద తన నలుపెరగనట్లు రాజంపేట ఎంపీ మిధున్‌రెడ్డి విమర్శలు చేస్తున్నాడన్నారు. గతంలో పుంగనూరులో జరిగిన సంఘటనలు అందరూ చూశారన్నారు. డెయిరీ పెట్టి రైతులతో నిర్బంధంగా పాలు పోయించుకున్న ఘనత మీదన్నారు. శ్రీకాకుళం నుంచి సైకిలుపై వస్తున్న టీడీపీ అభిమానులపై దౌర్జన్యం చేసింది, బీసీ నాయకుడు రామచంద్రయాదవ్‌పై భౌతిక దాడులకు దిగింది, ప్రతిపక్ష నాయకులపై దాడులు, అధికారులను, పోలీసులు అడ్డుపెట్టుకుని పుంగనూరులో చేసిన దౌర్జన్యాలు అందరికీ తెలుసునన్నారు. రాయచోటి నియోజకవర్గంలో మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి కుటుంబం ముందు నుంచి రాజకీయాల్లో ఉందని తెలిపారు. నువ్వు విమర్శించడం వల్ల మా నాయకుడికి మంత్రి పదవి రాలేదని, మా నాయకుడి పనితీరు మెచ్చుకుని సీఎం చంద్రబాబు మంత్రిపదవి ఇచ్చారన్నారు. మంత్రిగా బాధ్యతలు తీసుకుని రాష్ట్ర ప్రజల బాగోగులు చూస్తున్న నాయకుడు రాంప్రసాద్‌రెడ్డి అని తెలిపారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తే ఉలిక్కిపడుతున్నట్లు ఎద్దేవా చేశారు. మీరు మంచి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చేసి ఉంటే మంచి జరిగేదని చెడు చేశారు కాబట్టి ఓటమి పాలయ్యారన్నారు. నిందలు మానుకుని ఆత్మవిమర్శ చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కొత్తపురమ్మ తల్లి ఆలయంలో వడ్డేపల్లి గ్రామస్థుల ఆధ్వర్యంలో అమ్మవారికి 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ నాయకులు ఎద్దుల చిన్నప్ప రాజారెడ్డి, పసుపులేటి కోటేశ్వర, రామనాధ వల్లపు శంకర మదనపల్లి లక్ష్మికర్, మహేశ్, సుదర్శన్ పలువురు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా మానవత స్వచ్ఛంద సంస్థ సేవలు

రాయచోటిటౌన్, జూన్ 30: పట్టణంలోని డైట్ స్కూల్‌లో మానవత శాఖ మాజీ అధ్యక్షుడు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, సెక్రటరీ వెంకటరామానాయుడు, గౌరవాధ్యక్షుడు వెంకట్రమణ, జిల్లా కమిటీ సభ్యుడు ఆనందరెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి మానవతాశాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. మానవత కేంద్ర కమిటీ నియంత్రణ డైరెక్టర్ రాటాల గోపి, నాగార్జున, మహిళా డిగ్రీ కళాశాల డైరెక్టర్ శివవిష్ణుమోహన్‌రెడ్డితో పాటు వృక్ష రక్షణ సమితి వ్యవస్థాపకుడు ఎన్. తులసిరెడ్డి, రోటరీక్లబ్ సభ్యులు సయ్యద్ రియాజుద్దీన్, ఎస్‌కే హుస్సేన్, కొరియర్ షఫీ, కేవీఎస్ నాయకుడు విశ్రాంత వెటర్నరీ వైద్యులు ఎంబీ రమేశ్, మానవత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయచోటి మానవతశాఖ నూతన కమిటీ అధ్యక్షులు ఖాదర్‌బాషా, సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, కోశాధికారి మురళీమోహన్, ఉపాధ్యక్షులు గంగాధర్‌నాయుడులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అవకాశం కల్పించిన మానవత కుటుంబ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

చిట్వేలి: మానవతా చిట్వేలిశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక సాయివికాస్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపిక చేశారు. కడప కేంద్ర కమిటీ డైరెక్టర్, సభ్యులు రెడ్డన్న, కడప టౌను కార్యదర్శి బివి సుబ్బరాయుడులు పాల్గొన్న సమావేశంలో అధ్యక్షుడుగా మునిరావు, కార్యదర్శిగా సాయిరాం, కోశాధికారిగా రంగారెడ్డి, గౌరవ డైరెక్టర్ బోర్డు సభ్యులుగా, చైర్మన్‌గా తిరుమల విశ్వనాథం, ఉమామహేశ్వర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, శ్రీనివాసులు, వీరాంజనేయరాజులను ఎంపిక చేసి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా చిట్వేలిశాఖ సభ్యులను కొనియాడారు. సభ్యత్వాలు బలోపేతం చేసి మానవతా సేవలను మరింత విస్తరింపజేయాలని సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మానవతా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె : మానవత సంస్థ నూతన కమిటీ ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర కమిటీ సభ్యుడు సహదేవరెడ్డి తెలిపారు. ఆదివారం సుండుపల్లెలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. మండల అధ్యక్షుడిగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా హరికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రజలకు సేవ చేసేందుకు సంస్థకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇప్పటికే సంస్థకు సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ గంగిరెడ్డి, జిల్లా సభ్యులు సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సన్మానం అందుకుంటున్న మానవత రాయచోటిశాఖ నూతన కమిటీ సభ్యులు



సుండుపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యుడు సహదేవరెడ్డి

చిత్తూరు జిల్లాలో అల్లర్లకు 'పెద్దిరెడ్డి' ప్రణాళిక

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, జూన్ 30: తెలుగుదేశం పార్టీ అనూహ్య విజయాన్ని ఓర్వలేక పెద్దిరెడ్డి కుటుంబం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అల్లర్లు సృష్టించాలని చూస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ శాంతియుతంగా ఉన్న పుంగనూరు నియోజకవర్గంలో గొడవలు సృష్టించి ప్రజల్లో అశాంతిని నెలకొల్పాలని యోచిస్తున్న పెద్దిరెడ్డి కుటుంబాన్ని పుంగనూరుకు రాకుండా చేయాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజలు హాయిగా ఉన్నారని గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి అండదండలు చూసుకొని వైసీపీ నాయకులు అల్లర్లకు, హత్యలకు పాల్పడ్డారన్నారు. కుప్పం, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో చాలా మంది టీడీపీ నాయకులపై వైసీపీ ప్రభుత్వం అక్రమ



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

కేసులు బనాయించి చేయని తప్పులకు పోలీసు వారిని అడ్డం పెట్టుకొని ఎన్నో దుర్మార్గపు చర్యలకు పాల్పడిందన్నారు. చంద్రబాబునాయుడు లాంటి గొప్ప నాయకుడు లేడన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రవీంద్రారెడ్డి, అంజద్అలీఖాన్, బసిరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై స్పందించని అధికారులు

వీరబల్లి, జూన్ 30: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించారని చెప్పినా, కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినా రెవెన్యూ అధికారుల్లో చలనం ఏ మాత్రం లేదని మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ శీతంపేట గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో శీతంపేటకు చెందిన వైసీపీ నాయకుడు గ్రామ సమీపంలోని ప్రభుత్వ స్థలంతోపాటు ఆ స్థలంలో వేసిన బోరును ఆక్రమించాడని కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు విన్నవించినా, ఆ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చినా అధికారులు ఏ మాత్రం మారడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా ఫిర్యాదు చేశారని, విచారించి ప్రభుత్వం స్థలం ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడేలా చూస్తామన్నారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

మదనపల్లె, జూన్ 30: మదనపల్లె పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న మరాఠీల ఆరాధ్యదైవం ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదివారంభూమి పూజ చేశారు. కొన్ని సంవత్సరాలుగా ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు మరాఠీల సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నారు. వారి ఆకాంక్ష మేరకు ఎమ్మెల్యే స్థానిక చిత్తూరు బస్టాండు కూడలి వద్ద విభూమి పూజ చేశారు. అంతకుముందు స్థానిక బంకలోల్ల సత్రంలో మదనపల్లె మరాఠీల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ పి.తులసీ, టీడీపీ నాయకుడు బంగారు రామకృష్ణ, మరాఠీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ఘనంగా బోయకొండమ్మ జాతర

నిమ్మనపల్లి, జూన్ 30: మండలంలోని పాతకొండసాని వారిపల్లిలో ఆదివారం బోయకొండమ్మ తల్లి జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.40లక్షలతో నిర్మించిన ఆలయంలో పూజలు, హోమాలు నిర్వహించి, జంతు బలులు సమర్పించారు. రాత్రి పిల్లనగ్రోవి, బళ్లారి డ్రమ్స్ మధ్య మహిళలు బోనాలు సమర్పించారు. ఆరిపిరెడ్డిగారిపల్లి, నిమ్మనపల్లి తదితర ప్రాంతాలలో జాతరలు నిర్వహించారు.

దివ్యాంగుల పెన్షన్ల పంపిణీపై అపోహలు వద్దు

● రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి

గాలివీడు, జూన్ 30: వికలాంగుల పెన్షన్ల పంపిణీపై ఆందోళన చెందాల్సిన పని లేదని రాష్ట్ర వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ గతంలో మనం చేసిన ఉద్యమాల ఫలితంగానే ప్రస్తుతం ప్రభుత్వం వికలాంగులకు రూ.6వేలు పెన్షన్ ఇవ్వడానికి ముందుకు వచ్చిందన్నారు. ఇలాంటి తరుణంలో ఎక్కువ ఇస్తున్న ఇతర పెన్షన్లతో పోల్చుకుని బాధపడడం సబబు కాదని గుర్తు చేశారు. ఇక పెన్షన్ల పంపిణీ విషయంలో ఎలాంటి అపోహలు వద్దని, ఎప్పటిలాగే జూలై 1న ఇళ్ల వద్దనే పంపిణీ చేస్తారన్నారు. అనంతరం పెన్షన్ల పెంపుపై సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

పెన్షన్ల పంపిణీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

సుండుపల్లె/రాజంపేట, జూన్ 30 : పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొనాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం పర్యటనలో భాగంగా ఆయన టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మొదటి నెలలోనే అమల్లోకి తీసుకువస్తూ పెన్షన్లను పెంచి ఇంటింటికీ పంపిణీ చేస్తున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రజలకు తెలపాలని కోరారు. పేదల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నిరంతరం రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. పెన్షన్ల పంపిణీని పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, పార్లమెంటు వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి దామోదర్ నాయుడు, శివరాంనాయుడు, సురేష్ నాయుడు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ పెన్షన్ల పంపిణీ చరిత్రాత్మకం

చిట్వేలి, జూన్ 30 : రాష్ట్రంలో ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ చరిత్రాత్మక ఘట్టమని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కూటమి అధికారంలోకి వస్తే పెన్షన్లను 3 వేల నుంచి 4 వేలు పెంచుతామని తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీలో భాగంగా జులై 1న ఇంటివద్దకే పెన్షన్ పంపిణీ చేయనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో ఉదయం 5 గంటల నుంచి నరసింహప్రసాద్ పంపిణీ కార్యక్రమంలో హాజరు కానున్నట్లు ఆయన తెలియజేశారు.

స్వచ్ఛ భారత్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

రైల్వేకోడూరు, జూన్ 30: గ్రామ పంచాయతీ, స్వచ్ఛ భారత్ కార్మికుల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాదరాజు గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. టైం స్కేలు వర్కర్స్‌కు 2 నుంచి 24 నెలల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, పెన్షన్‌తో పాటు మున్సిపల్ కార్మికులకు అమలు చేస్తున్న ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్సు అమలు చేయాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేస్తామని 1999లో ప్రభుత్వం జీవో జారీ చేసిందని గుర్తు చేశారు. జీవో నెం. 132ను వర్తింప జేయాలన్నారు. టెండర్లతో సంబంధం లేకుండా నెలకు రూ. 10 వేలు తగ్గకుండా జీతాలు ఇవ్వాలని డిమాండు చేశారు. దహన సంస్కారాలకు సాయం అందించాలన్నారు. గత ఏడేళ్లుగా జీతాలు పెంచలేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

రజక సంఘం అన్నమయ్య జిల్లా కార్యవర్గం ఎన్నిక



రమేశ్‌బాబు, శ్రీనివాసులు, ఎంవీ రమణ

రాయచోటి టౌన్, జూన్ 30: రజక సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా టీ. రమేశ్‌బాబు, వీ. శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని రాయుడు కాలనీ రామాలయంలో నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి కడప జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి అధ్యక్షతన అన్నమయ్య జిల్లా రజక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అన్నమయ్య జిల్లా రజక సంఘం అధ్యక్షుడుగా రమేశ్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, ట్రెజరర్‌గా అంజనమ్మ, ఉపాధ్యక్షులుగా ఎంవీ రమణ, సుబ్బ రాయుడు, పెంచలయ్య, కృష్ణయ్య, చెంద్రాయుడు, వెంకటరమణ, జ్ఞానమూర్తి, నాగరాజు, శ్రీనివాసులు, నారాయణ, రెడ్డిప్రసాద్, లక్ష్మీనారాయణ, వెంకట్రమణ, కార్యదర్శులుగా వెంకటసుబ్బయ్య, శంకర్, బాలరాజు, ప్రసాద్, రమేశ్, నటశేఖర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా విజయమ్మ, ఉపాధ్యక్షులుగా వెంకటలక్ష్మమ్మ, సరస్వతమ్మను ఎన్నుకు న్నారు. అనంతరం రజకులను షెడ్యూలు కులాల జాబితాలో చేర్చాలని ఏకగ్రీవంగా తీర్మా నించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా రజక నాయకులు శ్రీనివాసులు, యరికలయ్య, పిచ్చయ్య పాల్గొన్నారు.

బోయనపల్లెలో మన్ కీ బాత్ ప్రదర్శన

రాజంపేట, జూన్ 30: మండలంలోని బోయనపల్లె గ్రామంలో చేనేత కార్మికులతో కలిసి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఇతర బీజేపీ నాయకులు మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ప్రతినెల చివరి ఆదివారం ఈ కార్యక్రమం ప్రసారమవుతుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి తల్లిపైన ఎంతో ప్రేమ ఉంటుందని, అయితే ఆ ప్రేమను ఎలా వ్యక్తపరచాలో తెలుసుకోలేకపోతున్నారన్నారు. తల్లికి మించిన ప్రేమ అభిమానం ఎక్కడా దొరకదు అన్నారు. ప్రతి యువకుడు తమ తల్లిపేరిట ఒక మొక్కను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాపయ్య, ఆదినారాయణ, శ్రీనివాసులు, నగేష్, రమణాచారి, రమణ, సూర్యచంద్ర, బోయనపల్లె గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మూగవారిపల్లెలో గంగాలమ్మకు పొంగళ్లు



గంగమ్మ గుడి ముందు వేసిన ముగ్గు

పెనగలూరు, జూన్ 30 : మండలంలోని మూగవారిపల్లె హరిజనవాడలో ఆదివారం సాయంత్రం గ్రామదేవత గంగాలమ్మకు పొంగుబాళ్ల కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఆసాది బృందం గంగమ్మ గుడిముందు అమ్మవారి ముగ్గు పోసి ఆసాది కథను వినిపించారు. మధ్యాహ్నం పోతులరాజు ఊరేగింపులో ప్రతి ఇంటినుంచి బోనాలు తీసుకువచ్చి గంగమ్మ గుడి ముందు కట్టెలపొయ్యి వెలిగించి పొంగళ్లను పొంగించారు. అనంతరం పొంగళ్లకూడును అమ్మవారి గుడిముందు పోసి దున్నపోతును బలి ఇచ్చారు. అనంతరం కోళ్లు, పొట్టేళ్లు, మేకలను బలి ఇచ్చి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

రాయచోటిటౌన్ లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



శివారెడ్డి, ఇందాద్‌అహ్మద్, కిశోర్‌కుమార్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్ 30: రాయచోటి టౌన్ లయన్స్ క్లబ్ నూతన కార్యవరాన్ని ఆదివారం ఎన్నుఎకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా పీ. శివారెడ్డి, కార్యదర్శిగా షేక్. ఇందాద్ అహమ్మద్, కోశాధికారిగా జీ. కిశోర్‌కుమార్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీఎస్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. రాబోయే సంవత్సరంలో ప్రజలకు ఉపయోగ పడే సేవా కార్యక్రమాలు చేయాలని తెలిపారు. అనంతరం అధ్యక్షుడు పీ. శివారెడ్డి మాట్లాడుతూ గతంలో చేసిన కార్యక్రమాల కంటే భిన్నంగా సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్నలను పొందుతామన్నారు. తనపై నమ్మకంతో అవకాశం ఇచ్చిన ప్రతి సభ్యుడికి ధన్యవాదాలు తెలియజేశారు.

15 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్లకు ఎంపిక చేస్తున్న వైద్యులు

రాయచోటి టౌన్, జూన్ 30: చెన్నముక్కపల్లెలోని లయన్స్ కంటి ఆసు పత్రిలో ఆదివారం 40 మంది కి పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యు లు అర్హులైన 15 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయిం చుకున్న 40 మందికి పరీక్షలు నిర్వ హించి ఉచితంగా అద్దాలు, మందు లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీ స్వరూపగుప్త, ఆసుపత్రి కోశాధికారి శివప్రసాద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 30: మండలంలోని అనంతపురం గ్రామంలో ఆదివారం గంగమ్మకు పూజలు నిర్వహిం చారు. వేలాది మంది భక్తులు మొక్కుబడులు చెల్లిం చారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణ భక్తులతో కిక్కిరిసింది.

సకల సమస్యలూ ముంచెత్తినపుడు కనిపించని దేవుడ్ని నమ్ముకుని మనసు కుదుటపరచుకుంటాం. అనారోగ్యం ముట్టడించి ఆందోళనపరచినపుడు కనిపించే వైద్యుల మీద భారం వేసి చేతులు జోడిస్తాం. గంభీరంగా కనిపించే డాక్టర్ల తెల్లకోటు వెనుక నిరంతరం ఒక కల్లోలం సుడి తిరుగుతూ ఉంటుంది. ప్రతి క్షణం ఒక సవాలే. ప్రతి రోగీ ఒక పాఠమే. ముఖ్యంగా అరకొర వసతుల ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉప్పెనలా వచ్చిపడే కేసుల నడుమ ప్రతి డాక్టర్ చేసేది వైద్యావధానమే. మతం చూడరు. కులం చూడరు. రోగి స్తోమత చూడరు. ప్రతి ప్రాణం కాపాడడమే లక్ష్యంగా పనిచేస్తారు. చదువుకున్న శాస్త్రానికి కూడా ఒక్కోసారి రోగం అర్థం కాదు. పరిస్థితి విషమించిన విపత్కర సమయంలో తీసుకునే నిర్ణయం కీలకమైనది. అది అన్నిసార్లూ ఉద్యోగ నియమాలకు లోబడి ఉండదు. మందులతో కాక మనసుతో వైద్యం చేయాల్సిన సందర్భాలే ఎక్కువగా ఉంటాయి. రోగి బంధువుల ఆగ్రహావేశాలకూ బలికావలసి ఉంటుంది. అటువంటి విషమ సమయాలను ఎదుర్కొన్న ప్రసిద్ధ డాక్టర్ల అనుభవాల సమాహారమే ఇది.

తిరుపతి ఆంధ్రజ్యోతి



కనిపించే దేవుళ్లకు వందనం

ఎదుర్కొన్న విషమ సందర్భాలపై ప్రసిద్ధ వైద్య నిపుణుల జ్ఞాపకానుభవాలు



డాక్టర్ గణపతి సుబ్రమణ్యం
సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్

తిరుపతిలో కూడా గుండె మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ప్రత్యేక విమానాల్లో గుండెను తీసుకువచ్చి అవసరమైనవారికి శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రిలో అమరుస్తున్నారు. ఈ అద్భుతం చేస్తున్నవారిలో ముఖ్యులు డాక్టర్ గణపతి సుబ్రమణ్యం. సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్. వైద్య రంగంలో పాతికేళ్లకు పైగా అనుభవం. ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంసీహెచ్ (కార్డియోథొరాసిక్ సర్జరీ) చేసిన ఆయన ఆస్ట్రేలియా, చెన్నైల్లో గుండె మార్పిడి శస్త్రచికిత్సపై అధ్యయనం చేశారు. అనుభవం సంపాదించారు. అపోలో ఆస్పత్రిలో పనిచేస్తూ, 2021లో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రికి వచ్చారు. సీనియర్ సీటీ సర్జన్‌గా తిరుపతిలో గుండె మార్పిడి ఆపరేషన్లు చేస్తూ, పిల్లల గుండె జబ్బులకు చికిత్స అందిస్తున్నారు.

గుండె మార్చడమా మానడమా..

"ఆ పిల్లాడికి 15ఏళ్లుంటుంది. గుండె జబ్బుతో శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షలు చేశాం. గుండె పంపింగ్ ఛాంబర్‌లో రక్తపు గడ్డలున్నట్టు గుర్తించాం. గుండె జబ్బులున్నవారిలో ఇది చాలా అరుదు. కృత్రిమ పరికరం కూడా పెట్టలేని పరిస్థితి. దీనికి గుండె మార్పిడి ఒక్కటే మార్గం. సరిగ్గా అప్పుడే బ్రెయిన్ డెడ్ వ్యక్తికి సంబంధించిన డోనర్ అలర్ట్ వచ్చింది. అదృష్టవశాత్తూ మార్పిడి కోసం గుండె దొరికే అవకాశం ఉంది. ఆ పిల్లాడికి గుండె మార్పిడి చేయాలని నిర్ణయించుకున్నాం. అయితే వాళ్లది చాలా పేద కుటుంబం. గుండె మార్పిడి తర్వాత కూడా చాల ఖర్చు అవుతుంది. క్రమం తప్పకుండా డాక్టర్‌ను కలుస్తూ, మందులు వేసుకుంటుండాలి. అలా చేస్తారో లేదోనన్న అనుమానం కలిగింది. తగిన అవగాహన కల్పిద్దామనుకుని ఆపరేషన్‌కు సిద్ధపడ్డాం. అన్ని పరీక్షలూ చేసిన తర్వాత ఊపిరితిత్తుల్లో ఫ్లూయిడ్ ఉన్నట్టు గుర్తించాం. గుండె పనితీరు విఫలమైన రోగుల్లో ఇది సాధారణమే. అందుకే ఆపరేషన్‌కు అన్నీ సిద్ధం చేసుకున్నాం. అయితే అది ఫ్లూయిడ్ కాదని, కుడివైపు ఉన్న లంగ్‌కు ఇన్‌ఫెక్షన్ అని తేలింది. లంగ్ ఇన్‌ఫెక్షన్ ఉంటే గుండె మార్పిడి చేయకూడదు. మెత్తగా ఉండాల్సిన లంగ్ గట్టిగా మారిపోయి ఉంది. గుండె మార్పిడి తర్వాత ఇచ్చే డ్రగ్స్ వలన ఊపిరితిత్తులు ఇంకా ప్రమాదకర పరిస్థితికి వెళ్లొచ్చు. ఇటువంటి స్థితిలో ఏం చేయాలి? ఇంతలో డోనర్ హార్ట్ వచ్చేసింది. వేరే దారిలేదు. గుండె మార్చకపోయినా ప్రాణానికి ప్రమాదమే. అందుకే ముందుకు వెళ్లాలనే నిర్ణయించుకున్నాం. ఆపరేషన్ చేసేశాం. ఇన్‌ఫెక్షన్ మరింత ఎక్కువై లైఫ్ రిస్క్ అయ్యే అవకాశం ఉంది. పల్మనాలజిస్ట్ ఓపీనియన్‌తో పోస్ట్ ఆపరేటివ్ కేర్ తీసుకున్నాం. వైద్యశాస్త్రంలో కూడా కొన్నిసార్లు అద్భుతాలు జరుగుతాయి. అదృష్టవశాత్తూ క్రమంగా ఆపిల్లాడికి లంగ్ ఇన్‌ఫెక్షన్ తగ్గింది. గుండె మార్పిడి చేసుకున్న అతను ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడు. రెగ్యులర్‌గా చెకప్‌కి వస్తున్నాడు. మందులు వేసుకుంటూ ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్నాడు. ఆ పిల్లాడి మొహంలో కనిపించే వెలుగు చాలదా ఒక డాక్టర్‌గా జీవితాంతం తృప్తి పడడానికి. స్విమ్స్ డాక్టర్ అల్లాడి మోహన్ ఒకసారి అన్నమాట గుర్తుకువస్తుంటుంది. 'ఇక్కడ ఒక్కోసారి అల్లోపతి, హోమియోపతి కన్నా కొండపై ఉన్న వెంకటాచలపతి వైద్యం పనిచేస్తుంటుంది' అని ఆస్పత్రిలోని వెంకన్న ఫోటోవైపు చూస్తూ చెప్పారు. నిజమే కదా!"



డాక్టర్ పీజే నాయుడు
ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి

కొవిడ్ గడగడలాడించిన కాలంలో ఎందరికో ఆపద్బాంధవుడిగా నిలిచిన డాక్టర్.. పీజే నాయుడు. ఆస్టర్ నారాయణాద్రిలో సీనియర్ జనరల్ కన్సల్టెంట్‌గా ఉన్నారు. కరోనా కల్లోలం సృష్టిస్తున్న రోజుల్లో వైద్యుడిగా ఆయన అందించిన సేవలు మరిచిపోలేనివి. రోజుకు 12గంటలకు పైగా పీపీఈ కిట్ ధరించి కొవిడ్ వార్డుల్లోనే గడిపారు. సహచర వైద్యులకూ, సిబ్బందికీ ధైర్యం చెబుతూ, భరోసానిస్తూ రోగులకు సేవలందించారు. ఒక యోధుడిలా కొవిడ్‌పై యుద్ధం చేశారు.

12గంటలూ పీపీఈ సూట్‌లో..

"కొవిడ్ పీరియడ్ నా కెరీర్‌లో అతిక్లిష్టమైన సమయం. నేను వైద్యం చేసిన ప్రతి బాధితుడూ నాకొక జ్ఞాపకమే. కొవిడ్ అంటే అందరూ భయపడుతున్న రోజుల్లో పీపీఈ కిట్ ధరించి ఉదయం ఏడు నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా పనిచేయాల్సి వచ్చింది. ఆ సమయంలో సన్నిహితులు, సహచర వైద్యులు కూడా కొవిడ్‌తో అడ్మిట్ అవుతున్నారు. వారిని వెంటిలేటర్ మీద ప్రమాదకర పరిస్థితుల్లో చూస్తుంటే గుండె తరుక్కుపోయేది. వైద్యుడిగా ఆ పరిస్థితి నన్ను బలహీనపరచకుండా చూసుకోవడం అన్నింటికన్నా పెద్ద సవాలుగా మారింది. అదొక యుద్ధ క్షేత్రం. వెనుతిరిగే సమయమూ లేదు. అవకాశమూ ఉండదు. కనిపించని క్రిమితో ప్రాణాలకు వెరవకుండా యుద్ధం చేయడమే. వెనుదిరగలేదు. ప్రతి కేసూ భిన్నమైనదే. పుస్తకాల చదువుకు అనుభవాన్ని జోడించి వైద్యం చేయాలి. ఊపిరాడని స్థితిలో వచ్చి చేరే బాధితులు.. వాళ్ల కోసం బంధుమిత్రుల ఆందోళనతో కూడిన ఒత్తిళ్లు, వీఐపీల ఫోన్లు... కొవిడ్ కాలంలో దాదాపు పదివేల మంది బాధితులకు వైద్యసేవలు అందించి ఉంటా. ఒక వైద్యుడిగా బహుశా జీవితకాలంలో దక్కే అనుభవాలను కొవిడ్.. ఏడాదిలో నాకు ఇచ్చింది. ప్రాణాలొడ్డి చేసిన ఆ పోరాటం వృథా కాలేదు. ఇప్పటికీ నన్ను చాలామంది గుర్తుపట్టి చేతులు జోడించి పకలరిస్తూ ఉంటారు. 'మీరు మా ఇంట్లోవాళ్లకు కొవిడ్‌లో వైద్యం చేశారు. దేవుడు సర్' అంటుంటారు. ఆ తర్వాత నన్ను ఒక మాట అడుగుతుంటారు. 'కొవిడ్‌లో భయపడకుండా ఎలా ఉన్నారు?' అని. వారికి నేను చెప్పే సమాధానం ఒక్కటే.. 'నేను స్వామి సన్నిధిలో సేవ చేస్తున్నా. నన్ను ఆయనే చూసుకుంటారు' అని. అదే జరిగింది."



డాక్టర్ పెన్నా కృష్ణప్రశాంతి
సీనియర్ ఫిజిషియన్

వైద్యరంగంలో పరిచయం అక్కర్లేని పేరు డాక్టర్ పెన్నా కృష్ణప్రశాంతి. ఆరోగ్యపరంగా జిల్లాకు ఏ కష్టం వచ్చినా యంత్రాంగానికి వెంటనే ఆమె గుర్తుకొస్తారు. కొవిడ్ విపత్తులో ప్రతినిత్యం ఇటు మాధ్యమాల ద్వారా, అటు కొవిడ్ వార్ కమిటీలోనూ చురుకైన పాత్ర పోషించారు. వైద్యానికి మానవీయతను జోడించిన అరుదైన వైద్యురాలు. ప్రభుత్వ పాఠశాలల్లోని బాలబాలికలకు శారీరక అవగాహన కల్పిస్తుంటారు. షుగర్ వ్యాధి ప్రభావాల మీద విశేష అధ్యయనం చేశారు. అనేక దేశాల వైద్య సెమినార్లలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ 'బైరాక్' (బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్) ఇండిపెండెంట్ డైరెక్టర్. తెలుగు రాష్ట్రాల నుంచి 'బైరాక్'కు ఎంపికైన తొలి ప్రతినిధిగా చరిత్ర సృష్టించి తిరుపతి ప్రైడ్‌గా నిలిచారు.

భారతి నేర్పిన పాఠం

"నేను రుయాలో పనిచేస్తున్న రోజులు అవి. సూళ్లూరుపేట ప్రాంతం నుంచి భారతి అనే అమ్మాయి తీవ్ర రక్తహీనతతో వచ్చింది. ఏప్లాస్టిక్ అనీమియా. రక్తహీనతతో పాటూ ప్లేట్‌లెట్‌లు తగ్గిపోయి ఆమె శారీరక స్థితి దారుణంగా ఉంది. అప్పట్లో తిరుపతిలో హెమటాలజీ కూడా లేదు. తగిన పరీక్షలు చేయించుకోవడానికి వాళ్ల దగ్గర డబ్బులులేవు. కూలి చేస్తే తప్ప కూడులేని కుటుంబానికి ఆ పిల్లకి వైద్యం చేయించడం అసాధ్యం. పెద్ద ఆస్పత్రులకు వెళ్లలేరు. ప్రభుత్వ ఆస్పత్రి కాబట్టి రుయాకి వచ్చారు. తక్షణం పరీక్షలు చేయించాలి. వెంటనే వైద్యం మొదలు పెట్టాలి. వాళ్ల నాన్న వైద్యం చేయించలేమని చేతులెత్తేశాడు. టీనేజ్‌లోకి ప్రవేశిస్తున్న ఆ పాపను చూస్తే గుండె తరుక్కుపోతోంది. అలా వదిలేయలేకపోయాను. నా జీతం అప్పుడు రూ.6,500. ఆనెల జీతంలోనుంచి వెయ్యి రూపాయలు ఇచ్చి వైద్య పరీక్షలు చేయించాను. రుయాలో అడ్మిట్ చేయించాను. ఆ అమ్మాయి పరిస్థితిని వివరిస్తూ సాయం కోసం మీడియాలో కథనాలు వచ్చేలా చేశాను. ఎందరో దాతలు ముందుకొచ్చారు. అప్పటి ఎంపీ డాక్టర్ చింతామోహన్‌కి చెప్పి ఎంపీ నిధుల నుంచి రూ.12వేలు ఇప్పించాను. ఆతర్వాత వేలూరు సీఎంసీ ఆస్పత్రికి రెఫర్ చేశాం. వైద్యం కొనసాగింది. జీవితం మీద ఆశ పెంచుతూ ఆ పాపతో తరచూ మాట్లాడిన మాటలు చాలా పనిచేశాయి. ఆమెతో ఆత్మవిశ్వాసం పెరిగింది. బేలగా, బలహీనంగా ఆస్పత్రికి వచ్చిన అమ్మాయి దృఢంగా మారింది. క్రమంగా కోలుకుంది. ప్రాణాలతో తిరిగి రాదు అనుకున్న ఆ అమ్మాయి ఆరోగ్యంగా తిరిగి ఊరికి వెళ్లింది. చదువు కొనసాగించింది. అందుకు గ్రామస్తులు, టీచర్లు సహకరించారు. బీఎడ్ పూర్తిచేసింది. ఉద్యోగం సంపాదించింది. పెళ్లి కూడా చేసుకుంది. నేనూ వెళ్లాను. గలగలా మాట్లాడుతూ ఒక ఉత్సవంలా కనిపిస్తున్న భారతిని చూసినపుడు డాక్టర్‌గా కలిగిన ఆనందం వర్ణించలేనిది. ఆమెకు నేను చేసిన సాయం వెయ్యి రూపాయలు మాత్రమే. కానీ అవసర సమయంలో చేసిన ఆ వెయ్యి, ఇంకెన్నో వేలు వచ్చేలా దారి వేసింది. ఆమె ప్రాణాలు నిలిపింది. ఒక డాక్టర్, తమ దగ్గరకు వచ్చినవారి రోగాన్ని మాత్రమే చూస్తే సరిపోదు. మందులు మాత్రమే పరిష్కారం కాదు. వాళ్ల సామాజిక, ఆర్థిక పరిస్థితులు గమనించి చెప్పే మాటలు, ఇచ్చే ధైర్యం, భరోసా, సరైన సమయంలో చేసే సహాయం ఒక కుటుంబాన్నే నిలబెడతాయి అనే పాఠం భారతి సంఘటన నుంచి నేను నేర్చుకున్నాను."



డాక్టర్ పార్థసారథిరెడ్డి
సీనియర్ గైనకాలజిస్ట్

సాధారణంగా పురుష వైద్యులు గైనకాలజీ కోర్సును పెద్దగా ఎంచుకోరు. డాక్టర్ పార్థసారథిరెడ్డి మాత్రం గైనకాలజీ చేసి, నిపుణుడైన వైద్యుడిగా తిరుపతి నగరంలో పేరుపొందారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్నారు. పాతికేళ్లకు పైగా అనుభవం. పేదలు ఆయన్ని వెతుక్కుంటూ వస్తారు. ప్రసూతి ఆస్పత్రిలో ఆయన ఓపీకి చాలా డిమాండు. సాయంత్రం వేళ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలోనూ సేవలందిస్తారు. తక్కువ ఖర్చుతో కాన్పులు చేస్తారు. అనవసర సిజేరియన్‌లను ప్రోత్సహించరు.

అర్ధరాత్రి యుద్ధం

"పదేళ్ల కిందట.. గర్భంతో ఉందంటూ ఒక మహిళను తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆమెది వెంకటగిరి. ఆపరేషన్ చేసి బిడ్డను తీయమన్నారు. కడుపు నొప్పితో ఆమె మెలికలు తిరిగిపోతోంది. స్కానింగ్ చేశాం. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీగా ప్రాథమిక అంచనాకు వచ్చాం. అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని నిర్ణయించాం. రాత్రి 10 గంటలకు ఆపరేషన్ మొదలుపెట్టాం. సిజేరియన్ కోసం పొట్ట దగ్గర కట్ చేసి చేయిపెట్టగానే పెద్ద రక్తనాళంలో గడ్డ పగిలిపోయి, విపరీతమైన రక్తస్రావం జరిగింది. గుండెనుంచి వచ్చే ధమనిలో (కిడ్నీల సమీపంలో) పెద్దగడ్డ (ఇలియాక్ ఆర్టరీ ఎన్యూరిజమ్) పెరిగి ఉంది. నిజానికి గర్భాశయంలో బిడ్డ లేదు. ఆపరేషన్ ప్రక్రియ మొదలుపెట్టగానే గడ్డ పగిలిపోయింది. విపత్కర పరిస్థితి. వెంటనే రుయానుంచి యూరాలజిస్ట్ డాక్టర్ రమేష్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ భారతిని పిలిపించాం. ఈలోగానే ఆమెకు మూడు సార్లు కార్డియాక్ అరెస్టు వచ్చింది. పరిస్థితి వివరించగానే స్విమ్స్‌నుంచి ప్రముఖ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ అబాచంద్రన్ వచ్చారు. ఆపరేషన్ కొనసాగింది. రాత్రి పది గంటలకు మొదలైన ఆపరేషన్ పూర్తయ్యేసరికి తెల్లవారుజాము 4గంటలైంది. విజయవంతంగా రక్తనాళాన్ని సరిచేశాం. అయితే ఆమెకు వెంటిలేటర్ సహాయం కావాలి. స్విమ్స్‌కు తీసుకువెళ్లాలి. మధ్యలో ఏం జరుగుతుందో తెలీదు. నేనే దగ్గరుండి తీసుకెళ్లా. అక్కడ రూ.3వేలు అడ్వాన్స్ కట్టమన్నారు. రోగి సహాయకుల దగ్గర డబ్బులు లేవు. నా దగ్గర ఉన్న డబ్బులు కట్టేసి అడ్మిట్ చేశా. ఆ అర్ధరాత్రి ఒక యుద్ధంలా సాగింది. ప్రతి క్షణం టెన్షన్‌తో గడిచింది. సమయానికి అందరు డాక్టర్లూ వచ్చి సహకరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల గురించి చులకనగా మాట్లాడేవాళ్లకు ఇటువంటివి అర్థమైతే బావుండును. రెండు రోజులకే ఆమె కోలుకున్నారు. డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళుతూ నా దగ్గరకొచ్చి చేతులు జోడించిన ఆమె కళ్లలో తొణికిసలాడిన నీటి పొరను చూసి నాకళ్లు కూడా చెమ్మగిల్లాయి.. అయితే ఆ ప్రాణాన్ని కాపాడగలిగాము కదా అనే ఆనందంతో."

మూడో తేదీ వరకు తోతాపురి కేజీ రూ.24



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30: జిల్లాలో ఈనెల మూడో తేదీ వరకు మామిడి ధర కిలో రూ.24కు తగ్గకుండా ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మామిడి ధరలపై రైతులు, గుజ్జు పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశమయ్యారు. తోతాపురి మామిడికి గతంలో కేజీ రూ.30 గిట్టుబాటు ధర నిర్ణయించామని గుర్తు చేశారు. రైతులు, గుజ్జుపారిశ్రామికవేత్తల అభిప్రాయాలను స్వీకరించిన తర్వాత బుధవారం వరకు రూ.24కు తగ్గకుండా ధర కొనసాగించాలని నిర్ణయించామన్నారు. బుధవారం మరోసారి సమావేశమై ధర పెంపుదలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రైతులు నేరుగా మామిడిని గుజ్జు పరిశ్రమల యూనిట్ వద్దకు తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, గుజ్జు పరిశ్రమల సంఘ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, జూన్30: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తామన్నారు.జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

- ఎస్పీ కార్యాలయంలోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు శాఖకు సంబంధించి సమస్యలుంటే నేరుగా కలిసి వివరించాలని కోరారు.

200 సెల్‌ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను చూపిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, జూన్ 30: జిల్లాలో చోరీకి గురైన రూ.45 లక్షల విలువ చేసే 200 ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఆ వివరాలను ఆదివారం ఎస్పీ మణికంఠ పోలీసు అతిథి గృహంలో మీడియాకు వివరించారు. పోగొట్టుకున్న ఫోన్లను చిత్తూరు పోలీసు చాట్‌బాట్ ప్రత్యేక యాప్ ద్వారా తిరిగి పొందవచ్చునన్నారు. ఆరు దశల్లో ఇప్పటి వరకు రూ.3.60 కోట్ల విలువ చేసే 1,700 ఫోన్లను రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఆరో దశలో 200 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు చెప్పారు. చోరీకి గురైన ఫోన్లు ఏ రాష్ట్రంలో ఉన్నా ఈ యాప్ ద్వారా రికవరీ చేయవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ బ్రాంచ్ సీఐ రామాంజినేయులు, చాట్‌బాట్ సిబ్బంది బాషాజీ, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

చాట్‌బాట్‌కు పంపాల్సిన విధానం

మొబైల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ముందుగా 94409 00004కు వాట్సాప్ ద్వారా హాయ్ లేదా హెల్ప్ అని మెసేజ్ పంపాలి. వెంటనే వెల్‌కం ఇన్ చిత్తూరు పోలీసు పేరున లింకు వస్తుంది. గూగుల్ ఫార్మెట్ ఓపెన్ అవుతుంది. వివరాలను పూరించాలి. సబ్మిట్ చేస్తే కంప్లయింట్ నమోదవుతుంది.

పోలవరం, అమరావతికి విజయనగరం ఎంపీ తొలి జీతం



శ్రీవారి ఆలయం ముందు కలిశెట్టి అప్పలనాయుడు

తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తన మొదటి నెల జీతం అమరావతి అభివృద్ధి, పోలవరం నిర్మాణం కోసం ఇవ్వాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు నిర్ణయించుకున్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన స్వామి సన్నిధిలో ఈ నిర్ణయం తీసుకున్నారు. తన తొలి జీతాన్ని సీఎం చంద్రబాబుకు అందించనున్నారు. రాష్ట్రానికి రెండు కళ్లుగా ఉన్న రాజధాని, పోలవరం నిర్మాణానికి సీఎం పూనుకున్నారని, ఆయనకు అండగా ఉండేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు విదేశాల్లో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐలు సైతం తమ వంతుగా విరాళాలు ఇచ్చి మద్దతుగా నిలవాలని అప్పలనాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఈనాడు సంస్థ అధినేత రామోజీరావు తనకు ఆదర్శమన్నారు. పోలవరం, రాజధాని అమరావతి రెండు ప్రాజెక్టులు అభివృద్ధి చెందాలని, ఏపీని ప్రగతిపథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబుకు ఆశీస్సులు ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నట్టు తెలిపారు.

ఎర్రజెండా నీడన నా అనుభవాలు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న నేతలు తదితరులు

తిరుపతి (కల్చరల్), జూన్ 30: ప్రముఖ వామపక్ష నాయకుడు ఏవీ వర్మ రచించిన ఎర్రజెండా నీడన నా అనుభవాలు పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక యశోదానగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రం హాలులో జరిగింది. పుస్తకాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు పెనుమల్లి మధు ఆవిష్కరించారు. కాగా తపాలా శాఖలో విధినిర్వహణ చేస్తూ అనేక సామాజిక సమస్యలను ప్రజా పోరాటాల ద్వారా పాలక వర్గాల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించడంలో ఏవీ వర్మ సాగించిన పోరాటం, వామపక్ష అభిమానిగా ఆయన నిబద్ధత, కృషి, ఉమ్మడి జిల్లాలో వామపక్షపార్టీ భావజాలం వ్యాప్తిలో పాత్రను వక్తలు ప్రస్తుతించారు. డబ్బు, సంపద లేకపోయినా ప్రజలకోసం జీవించడం ఎలాగో వర్మ ఆచరించి చూపారని, పుస్తకంలో అటువంటి అనేక అనుభవాలను ఆయన పేర్కొన్నారని తెలిపారు. సీనియర్ పాత్రికేయులు ఆలూరి రాఘవ పుస్తక సమీక్ష చేశారు. ముఖ్యఅతిథులుగా సీఐటీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, అంజయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ప్రముఖ వైద్యులు డాక్టర్ మునస్వామి, గుంటూరు జిల్లా వామపక్ష నేత నిమ్మగడ్డ నాగేశ్వరరావు, కందారపు మురళి తదితరులు వేదికపై ప్రసంగించారు. వేమన విజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, ఓ.వి.రమణ, తోటవెంకటేశ్వర్లు, దామోదరం, వామపక్షపార్టీల సభ్యులు, రచయిత వర్మ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నేటినుంచి తిరుపతి-కాట్పాడి మెము రైళ్ల రద్దు

పెరంబూర్, జూన్ 30: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్‌లోని పలు మార్గాల్లో ట్రాక్ మరమ్మతుల కారణంగా జూలై ఒకటి నుంచి 31వ తేదీ వరకు పలు మెము రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- తిరుపతి నుంచి ఉదయం 6.50 గంటలకు బయలుదేరే తిరుపతి - కాట్పాడి మెము స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (నెం 07659), రాత్రి 9.15 గంటలకు కాట్పాడి నుంచి బయలుదేరే కాట్పాడి - తిరుపతి మెము స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (నెం.07582) నెలరోజులు రద్దవుతాయి.

ఇదే విధంగా కాట్పాడి నుంచి ఉదయం 9.30 గంటలకు బయలుదేరే కాట్పాడి - జోలార్‌పేట మెము స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (నెం.06417), మధ్యాహ్నం 12.45 గంటలకు జోలార్‌పేట నుంచి బయలుదేరే జోలార్‌పేట - కాట్పాడి మెము ఎక్స్‌ప్రెస్ (06418) రైలు నెల రోజులు రద్దు చేశారు.

పాక్షిక రద్దు...

తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు బయలుదేరే తిరుపతి - విల్లుపురం ఎక్స్‌ప్రెస్ రైలు (నెం.16853) తిరుపతి - కాట్పాడి మధ్య జూలై ఒకటి నుంచి నెలరోజులపాటు పాక్షికంగా రద్దు చేస్తున్నారు. అలాగే విల్లుపురం నుంచి ఉదయం 5.35 గంటలకు బయలుదేరే విల్లుపురం - తిరుపతి ఎక్స్‌ప్రెస్ (నెం.16854) కాట్పాడి - తిరుపతి మధ్య నెలరోజులు పాక్షికంగా రద్దు చేస్తున్నారు.



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, జూన్ 30: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 25వేల మంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే పెద్దసంఖ్యలో భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

గంగమ్మ నామ స్మరణతో మార్మోగిన బోయకొండ



చౌడేపల్లి, జూన్ 30: బోయకొండ గంగమ్మ ఆలయం భక్తుల గంగమ్మ నామ స్మరణతో మార్మోగింది. ఆదివారం ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వర్ణాభరణాలు పూలతో అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముక్కంటి ఆలయ ఈవోగా మూర్తి



శ్రీకాళహస్తి, జూన్ 30: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా తిరుపతి దేవదాయశాఖ ఆర్‌జేసీగా పనిచేస్తున్న ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు.అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా పనిచేస్తున్న ఎస్వీ నాగేశ్వరరావు ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏకాంబరం, మల్లికార్జునప్రసాద్, సతీష్‌మాలిక్, నాగభూషణం యాదవ్, హరియాదవ్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

● నేడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పండుగ ● ఇంటి వద్దకే నేరుగా పింఛన్లు ● తంబళ్లపల్లె నియోజకవర్గంలో 41,211 మందికి రూ.28.12 కోట్లు విడుదల

ములకలచెరువు, జూన్ 30: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం 6గంటల నుంచే ఇంటింటికి పింఛన్ల పంపిణీ ప్రారంభం కానుండడంతో కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పండుగలా నిర్వహించనున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో సోమవారం పింఛన్ల పండగ జరగనుంది. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీరించిన అనంతరం తొలి నెలలోనే లబ్ధిదారులకు పెంచిన పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం బాధ్యతలు స్వీకరించాకా ఐదు చారిత్రాత్మక ఫైళ్లపై సంతకాలు చేశారు. ఇందులో ఒకటైన పింఛన్ల పెంపు హామీ సోమవారం నెరవేర్చనున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పింఛన్లకు సంబంధించిన నగదును శుక్రవారమే ప్రభుత్వం విడుదల చేయడంతో శనివారం సంబంధిత ఎంపీడీవోలు నగదును డ్రా చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు రూ.వెయ్యి పింఛను పెరగ్గా టీడీపీ అధికారంలో వచ్చిన మొదటి నెలలోనే రూ.వెయ్యి పెంచి పంపిణీ చేయనున్నారు. అలాగే మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి మూడు నెలలకు రూ.వెయ్యి చొప్పున పెంచిన పింఛను పంపిణీ చేస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలప్పుడు ఇచ్చిన మాట ప్రకారం మూడు నెలలకు సంబంధించిన రూ.3వేలు, రూ.వెయ్యి పెంచి రూ.4వేలు చేసిన పింఛనును ఒక్కో పింఛనుదారుడికి రూ.7వేలు అందిస్తారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జండర్లు, మత్స్యకార కార్మికులకు, తీవ్ర అనారోగ్యంతో బాధపడే వారి లబ్ధిదారులకు కూడా పెరిగిన పింఛను అందజేస్తారు. తంబళ్లపల్లె నియోజవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 41,211 మంది లబ్ధిదారులు ఉండగా వారికి రూ.28.12 కోట్లు పంపిణీ చేయనున్నారు. ఉదయం 6 గంటల నుంచి. సచి వాలయ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను అందిస్తారు.

పింఛన్ల పండుగలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కండి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పింఛన్ల పండగలో టీడీపీ శ్రేణులందరూ పాల్గొని భాగస్వాములు కావాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ములకలచెరువులో పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పింఛన్ల పంపిణీ చేసే సచివాలయ సిబ్బందితో తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పింఛనును రూ.4వేలకు పెంచి అదనంగా రూ.వెయ్యి చొప్పున మూడు నెలల పింఛనును అందిస్తున్న ఘనత ముఖ్యంత్రి నారా చంద్రబాబునాయుడికే దక్కుతుందన్నారు. కాగా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పాల్గొంటారని ములకలచెరువు పార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ములకలచెరువు, ములకలచెరువు మండలం పెద్దపాళ్యం, వేపూరికోట, తంబళ్ళపల్లె టౌన్, పెద్దమండ్యం మండలం బండమీదపల్లె, కురబలకోట మండలం అంగళ్ళు, బి.కొత్తకోట మండల గట్టు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో జరిగే పింఛన్ల పంపిణీలో జయచంద్రారెడ్డి పాల్గొననున్నారు.

పింఛన్ల పంపిణీని విజయవంతం చేయండి

పెద్దమండ్యం, జూలై 30: టీడీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పెంచిన అన్ని రకాల పింఛన్‌లను లబ్ధిదారులకు జూలై 1వ తేదీన ఇంటి వద్ద పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయాలని పెద్దమండ్యం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని కలిచెర్ల లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పింఛన్‌లను సచివాలయ సిబ్బందితో పాటు వివిధ శాఖ సిబ్బందితో ఇంటి వద్ద పింఛన్‌ల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎన్‌డీఏ కూటమి నేతలు అందుబాటులో ఉండి పింఛన్‌దారులకు పింఛన్‌లు జరిగే విధంగా కృషి చేయాలన్నారు. సయ్యద్‌షావలి, ప్రభాకరరెడ్డి, నాగరాజా, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ

మదనపల్లె/అర్బన్, జూన్ 30: టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సోమవారం పింఛన్‌దారులకు ఇంటివద్దకే పింఛన్ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టుతోందని మదనపల్లె ఎంపీడీవో ఎన్ భానుప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మదనపల్లె మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో 14,173 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ. 9,39,30,926లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 215 మంది సిబ్బందితో ప్రతి పింఛన్‌దారుడి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అడ్మిన్లు, సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొంటారని చెప్పారు.

మండలం పేరు	లబ్ధిదారుల సంఖ్య	విడుదలైన నగదు
మదనపల్లె	14,173	9.39 కోట్లు
ములకలచెరువు	6755	4.88 కోట్లు
పెద్దమండ్యం	5634	3.68 కోట్లు
కురబలకోట	6539	4.41 కోట్లు
బి.కొత్తకోట	8005	5.46 కోట్లు
పెద్దతిప్పసముద్రం	8032	5.45 కోట్లు
తంబళ్లపల్లె	6246	4.24 కోట్లు

మున్సిపాలిటీ పరిధిలో 11,127 మందికి రూ.7.40కోట్లు

మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు వంటి వివిధ విభాగాల్లో 11,127 మంది పింఛనుదారులు ఉండగా రూ.7.40కోట్లు నిధులు విడుదలైనట్లు మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల తెలిపారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే షాజాహాన్ బాషా చేతుల మీదుగా పింఛను పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో 33 వార్డు సచివాలయాల పరిధిలోని 8 విభాగాలకు చెందిన 362 మంది సచివాలయ ఉద్యోగులు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇంటి వద్దకే వచ్చి పింఛను పంపిణీ చేస్తారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ దూసుకుపోతోంది. మూడు నెలలుగా ఇబ్బంది పడిన పండుటాకులకు నేటి నుంచి పెంచిన పింఛనుతో కలిపి ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలతో పాటు జూలై నెలతో కలిపి చెల్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రతి ఆదివారమూ మొక్కలు నాటాలి: ఎమ్మెల్యే


మదనపల్లెలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా

మదనపల్లె, జూన్ 30: మదనపల్లె మున్సిపాలిటీలో ప్రతి ఆదివారమూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా ప్రకటించారు. ఇందులోభాగంగా బీకేపల్లె ఇందిరమ్మకాలనీలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో ఈ వర్షాకాలంలో మొత్తం 50 వేల మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, మొదటి రోజు బీకేపల్లె, చౌడేశ్వరిగుడిరోడ్డు, గొల్లపల్లె క్రాస్ ఏరియాలలో రోడ్డు పక్కన సుమారు 500 మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రశాంతత వాతావరణానికి పేరు గాంచిన మదనపల్లెలో పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలను నాటడం ముఖ్యం కాదని, వాటిని సంరక్షించడమే ప్రధానమన్నారు. వర్షాలు వచ్చి మొక్కలు పెద్దవి అయ్యేవరకూ ట్యాంకర్లతో నీటిని పట్టి కాపాడాలని ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీలకు సూచించారు. శ్రీకాళహస్తి అటవీశాఖ నుంచి తబోబియరోజా, బిగోనియా, బహీనియా తదితర జాతుల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్ ఎన్.విద్యాసాగర్, మాజీకౌన్సిలర్ కె.భావన, టీడీపీ నాయకులు బాజ్జి, మల్లికార్జుననాయుడు, మున్సిపల్ పార్కుల శీనా, సచివాలయ ఉద్యోగులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్రాపెన్షనర్స్ పార్టీకి స్థలం కేటాయించండి

మదనపల్లె, జూన్ 30: ఆంధ్రాపెన్షనర్స్ పార్టీ మదనపల్లె యూనిట్ కార్యాలయం కోసం స్థలం కేటాయించాలని ఆ సంఘం నేతలు స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా ను కోరారు. స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల హామీలో భాగంగా మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేయాలని, ఆంధ్రాపెన్షనర్స్‌పార్టీకి స్థలం కేటాయించడంతోపాటు కమ్యూనిటీహాలు నిర్మించాని వారు కోరారు. మీ విన్నపాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను వారు ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఆపార్టీ నేతలు ఎం.మునిగోపాలకృష్ణ, మణికంఠనారాయణ, శ్రీనివాసులు, తిమ్మయ్య, ద్వారకనాథ్‌రెడ్డి, జగన్‌మోహన్, కృష్ణమూర్తి, గురునారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే పట్టణ పర్యటలో భాగంగా అంగన్‌వాడీలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు.

వలస పక్షులకు టీడీపీలో తావులేదు..


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం, జూన్ 30: ప్రభుత్వం వచ్చినప్పుడు పక్కకు చేరి పబ్బం గడుపుకోవాలని టీడీపీలోకి రావాలనుకునే వలస పక్షులకు పార్టీలో తావులేదని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. రామసముద్రం మండలం చెంబకూరులో పంచాయతీ మచ్చువారిపల్లెలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం లేనప్పుడు పార్టీకి కష్టపడి పని చేసిన నాయకులకు, కార్యకర్తలకు నేనెప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసిన వారు ఇప్పుడు తమ స్వలాభం కోసం అసలైన కార్యకర్తలపై ఆరోపణలు చేస్తూ టీడీపీలో చేరాలనుకునే వారికి అవకాశం లేదన్నారు. ఈసందర్భంగా ఇటీవల కొందమంది వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, చౌకదుకాణ డీలర్లు, నాయకులు మిమ్మల్ని కలవడం సరికాదని ఎమ్మెల్యేకు టీడీపీ నేతలు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నిజమైన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని, ఈ విషయంలో ఎలాంటి అపోహలు వద్దని నాయకులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, మదనపల్లె టౌన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ విద్యాసాగర్, సర్పంచ్ ఇంజమ్ వెంకటరమణ, చెంబకూరు మాజీ సర్పంచ్ తిప్పన్న, టేకుపల్లె రామమూర్తి, రమణ, కటిక మంజునాథ్, జగన్నాథం, కళ్లు రమేష్, వికాస్‌స్వామి, రంగాని వెంకటేష్, గుర్రాల కృష్ణమూర్తి, మనేవారిపల్లె జయప్రకాష్, బొంపల్లె సోము, గాండ్ల నాగరాజు, మల్లూరు అశోక్, కృష్ణమూర్తి, సీర్లపల్లె రమణ, స్వీట్ స్టాల్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో అందరం భాగస్వాములవుదాం

● జనసేన తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ వెల్లడి


ఎగువపల్లెలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో సాయినాథ్

పెద్దతిప్పసముద్రం జూన్ 30 : రాష్ట్రాభివృద్ధిలో అందరూ భాగస్వాములవుదామని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ వెల్లడించారు. ఆదివారం ఆయన మండలంలోని అంకిరెడ్డిపల్లె పంచాయతీ ఎగువపల్లెలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎగువపల్లె రామచంద్ర అధ్యక్షతన కూటమి జెండాల ఆవిష్కరణ, కూటమి విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్నారు. ఎగువపల్లెలో జనసేన, టీడీపీ, బీజేపీ జెండాలను కూటమి నేతల సమక్షంలో ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ గాడి తప్పిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొలువు తీరడం రాష్ట్ర ప్రజలకు శుభసూచకమన్నారు. కార్యక్రమంలో జనసేన పీటీఎం మండల అధ్యక్షుడు శంకర, ఉపాధ్యక్షుడు సూరి, జనసేన మండల ప్రధాన కార్యదర్శి దేవేంద్ర, రవికుమార్, గంగాద్రి, పవన్, పెద్దమండ్యం అధ్యక్షుడు శంకర, తంబళ్లపల్లె ఉపాధ్యక్షుడు మురళి, అనిల్, సూరి, నాగేష్, మహేష్, సాయివర్ధన్, సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

మదనపల్లె, జూన్ 30: మదనపల్లె పట్టణంలో అధిక సంఖ్యలో ఉన్న మరాఠీల ఆరాధ్య దైవం ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే షాజాహాన్ బాషా భూమి పూజ చేశారు. కొన్ని సంవత్సరాలుగా మరాఠీల సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు మరాఠీలు పోరాటం చేస్తున్నారు. మరాఠీల ఆకాంక్ష మేరకు ఆదివారం ఎమ్మెల్యే షాజాహాన్‌బాషా స్థానిక చిత్తూరు బస్టాండు కూడలి వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటు చేయడానికి భూమి పూజ చేశారు. అంతకుముందు స్థానిక బంకలోల్ల సత్రంలో మదనపల్లె మరాఠీల సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మరాఠీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ పి.తులసీ, టీడీపీ నాయకుడు బంగారు రామకృష్ణ, మరాఠీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ అడుగుజాడలలో నడవాలి

● తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు


తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులుకు స్వాగతం పలుకుతున్న చింతలకిరణ్

బి.కొత్తకోట,జూన్30: ప్రతి జనసేన కార్యకర్త నిజాయితీ, పోరాటపటిమ లో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అడుగుజాడలలో నడిచి ఆయన ఆశయసాధనకు నిరంతర కృషి చేయాలని జనసేనపార్టీ తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన బి.కొత్తకోట పట్టణంలోని జనసేన నాయకుడు చింతల కిరణ్‌రాయల్ నివాసానికి విచ్చేశారు. స్థానికి జనసైనికులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రతికార్యకర్తను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రతి కార్యకర్తకూ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో షాకీర్, మనోహర్, ఆవులశీన, మహేష్, రాజేంద్రప్రసాద్, గౌతం, మహేంద్ర, గణేష్, రాజు, కేశవ పాల్గొన్నారు.

బలిజల ఐక్యతకు కలిసి పనిచేద్దాం


బలిజల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణప్రసాద్

వాల్మీకిపురం, జూన్ 30: బలిజలంతా ఐక్యతతో ముందుకెళ్లాలని రాష్ట్ర బలిజ సేన అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం వాల్మీకిపురంలో ఏర్పాటు చేసిన బలిజల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బలిజలంతా ఏకతాటిపైకి వచ్చి బలిజల హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు సమయం ఆసన్నమైందన్నారు. జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సహకారంతో మనమంతా అభివృద్ధిలో ముందుకెళ్దామని ఆయన పిలుపునిచ్చారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయిలలో రాష్ట్ర బలిజ సేన కమిటీలను నియమిస్తామని, తద్వారా తమ హక్కుల కోసం పోరాడుదామన్నారు. కార్యక్రమం లో శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం నాయకులు రిటైర్డు ఎస్ఐ శంకర్, టమోటా రామ చంద్ర, బొక్కసం రామకృష్ణ, ఆనంద, శేఖర్, వెంకటరమణ, శ్రీనివాసులు, రాధ పాల్గొన్నారు.

భూవివాదంలో ఇరువర్గాలపై కేసులు నమోదు

బి.కొత్తకోట, జూన్30: బి.కొత్తకోట మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ కొత్తపల్లి వద్ద నెలకొన్న భూవివాదం పై ఇరువర్గాలపై వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తమకు హక్కుగల భూమిలో అక్రమంగా ప్రవేశించి పంటను ధ్వంసం చేశారంటూ బి.కొత్తకోటకు చెందిన మహిళ అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బి.కొత్తకోట సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు, వైసీపీ నాయకుడు తిరుమల అమరనాథ్‌తో పాటు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. అదే విధంగా ఈ భూ వ్యవహారంలోనే వెంకట్రమణ ఫిర్యాదు మేరకు అరుణతోపాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 30: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వల్లిబసు తెలిపారు. పోలీసుల కథనం మేరకు కురబలకోట మండలం, కోనంగివారిపల్లె చెందిన డి. వెంకటేష్ (30) తన భార్యతో కలిసి ఈ నెల 19న మదనపల్లెకు వచ్చి తన ఆరోగ్యం సరిలేదని స్థానిక ప్రైవేట్ డాక్టర్ వద్ద పరీక్ష చేయించుకొన్న అనంతరం రీడింగ్ రూమ్‌వీధిలో షాపింగ్ కోసం వెళ్లారు. కాగా భార్యను అక్కడే వదిలేసి వెంకటేష్ అదృశ్యమయాడు. కుటుంబసభ్యులు తమ బంధువులు, స్నేహితుల ఊర్లలో వెతికారు. కానరాకపోవడంతో శనివారం రాత్రి వన్‌టౌన్ సీఐ యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మదనపల్లెలో విద్యార్థి అదృశ్యం


మదనపల్లె అర్బన్, జూన్ 30: విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వల్లిబసు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం జగన్ కాలనీకి చెందిన ఎం.సున్నీ ఉస్మాన్ అలీ కుమారుడు ఎం.సున్నీసులేమాన్ (12) శనివారం అదృశ్యమయ్యాడు. తండ్రి సున్నీ ఉస్మాన్‌అలీ ఫిర్యాదు మేరకు ఆదివారం విద్యార్థి అదృశ్యంపై వన్‌టౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన టీడీపీ కార్యకర్తలను పరామర్శించిన శ్రీరాంచినబాబు


శ్రీనివాసులు, కొండప్పలను పరామర్శిస్తున్న శ్రీరాం చినబాబు

మదనపల్లె అర్బన్, జూన్ 30: తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లులో గాయపడిన టీడీపీ కార్యకర్తలు శ్రీనివాసులు, కొండప్పలను స్థానిక జిల్లా ఆస్పత్రిలో ఆదివారం తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు తెలుపుతూ వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దొరస్వామినాయుడు, నాగరాజు, మోడెం శివ, వెంకటేష్, బాలకృష్ణ, శంకర, సహదేవ, శ్రీకాంత్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం


ప్రతిజ్ఞ చేస్తున్న మానవతా సంస్థ సభ్యులు

వాల్మీకిపురం, జూన్ 30: రాబోవు రోజుల్లో మానవతా సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృత చేద్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం వాల్మీకిపురం సత్యసాయి సేవా మందిరంలో నిర్వహించిన మానవతా సంస్థ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో వాల్మీకిపురంలో మానవతా సంస్థను ఏర్పాటు చేసి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఫ్రీజర్ బాక్స్‌ల సేవతో పాటు, ఉచిత శాంతి రథంతో పాటు అంబులెన్స్ సౌకర్యాలను నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. అంతకు ముందు జిల్లా అధ్యక్షుడు సంస్థ సభ్యులచే సేవా దృక్పథంతో సేవలు అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ రాబోవు రోజుల్లో సంస్థ కార్యకలాపాలను విస్తృతం చేస్తూ సమాజంలో ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కేశవరెడ్డి, రామకృష్ణారెడ్డి, భాస్కర్, లక్ష్మీనారాయణ, మణి, శంకర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మణిపూసకు ఆత్మీయసన్మానం


ప్రణీతకు ప్రశంసాపత్రం అందిస్తున్న అఖిలబ్రాహ్మణసేవా సమాఖ్యసభ్యులు

మదనపల్లె అర్బన్, జూన్ 30: ఏపీ ఎంసెట్, నీట్ పరీక్షల్లో రాష్ట్రస్థాయి లో ఐదవ ర్యాంకు సాధించిన స్థానిక డాక్టర్ అలూరి శ్రీకర్, కళ్యాణి దంపతుల కుమార్తె కుమారి అలూరి ప్రణీతకు ఆదివారం ఆత్మీయ సన్మానం చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించి మదనపల్లె పట్టణానికే మణిహారంగా నిలిచిందన్నారు. చిప్పిలి గ్రామంలోని చిట్టిఅన్నవరం లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో అఖిల బ్రాహ్మణ సేవా సమాఖ్య మదనపల్లె వారిచే అభినందన సభ నిర్వహించారు. ఇందులో ప్రణీతను పూలమాలలతో, దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు అమరనాథ్, సేవా సమాఖ్య అధ్యక్షుడు అక్షింతల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి వైద్యం రామకృష్ణ, కోశాధికారి విరూపాక్షం దివాకర్, ఉపాధ్యక్షులు గొల్లాపిన్ని రవీంద్రబాబు, ఆదినారాయణ శాస్త్రి, ఉపకార్యదర్శి ఆలూరు గౌరిశంకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ అధ్యక్షుడిని కలిసిన శంకర్‌యాదవ్



మదనపల్లె, జూన్ 30: తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన శుభసందర్భంగా శ్రీనివాస్‌యాదవ్‌ను, శంకర్‌యాదవ్ అభి నందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు తంబళ్లపల్లె రాజకీయ పరిస్థితులను గురించి ఆయన్ని అడిగి తెలుసుకున్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, జూన్ 30: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో 2024-26 విద్యా సంవత్సరానికి గానూ ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి రెండో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో రెండళ్ల వ్యవధి గల ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడ్లలో ఖాళీలున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అర్హులైన విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో గాని, ఐటీఐలో నేరుగా కాని పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు జూలై 24వ తేదీ లోపు తమ ఒరిజనల్ సర్టిఫికేట్లతో ఐటీఐలో వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేసుకున్న వారు మాత్రమే ఐటీఐలో అడ్మిషన్‌కు అర్హత పొందుతారని ప్రిన్సిపాల్ తెలియచేశారు.

వైభవంగా బోయకొండమ్మ తల్లి జాతర


అలంకరణలో బోయకొండమ్మ

నిమ్మనపల్లి, జూన్ 30: మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతి పాతకొండసానివారిపల్లిలో ఆదివారం బోయకొండమ్మ తల్లి జాతరను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా రూ.40లక్షలతో నిర్మించిన బోయకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. రాత్రి జాతరలో పిల్లనగ్రోవి, బళ్లారి డ్రమ్స్ మధ్య మహిళలు బోనాలను సమర్పించారు. అలాగే ఆరిపిరెడ్డిగారిపల్లి, నిమ్మనపల్లి తదితర ప్రాంతాలలో జాతరలు నిర్వహించారు.

సంతానలక్ష్మీకి ప్రత్యేక పూజలు



గుర్రంకొండ, జూన్ 30:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో ఆలయానికి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి.

రేపు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం

వాల్మీకిపురం, జూన్ 30:పట్టణంలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యే శ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు, శాంతి హోమాలు, అన్నదానం నిర్వహిస్తామన్నారు.

అవగాహనతోనే సర్వైకల్ క్యాన్సర్ నివారణ


వైద్య శిబిరంలో నిర్వాహకులు, వైద్యులతో మాట్లాడుతున్న అరబిందో నిత్యానంద రెడ్డి

పీలేరు, జూన్ 30: అవగాహనతోనే గ్రామీణ ప్రాంత మహిళలు సర్వైకల్ క్యాన్సర్‌ను నివారించుకోగలరని ప్రముఖ పారిశ్రామిక వేత్త నిత్యానందరెడ్డి పేర్కొన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సాయంతో శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు ఆదివారం కేవీపల్లెలో సర్వైకల్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్యానంద రెడ్డి మాట్లాడుతూ మారిన జీవనశైలి కారణంగా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయన్నారు. దాని గురించి అవగాహన పెంచుకుంటే దానిని సులభంగానే నివారించవచ్చన్నారు. శ్రీనివాసల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్.రవీంద్రనాథ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ మహిళల్లో కనిపిస్తున్న సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన, నివారణ కోసం తాము సంజీవని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత 23 ఏళ్లుగా తాము కేవీపల్లె, కలకడ, కలికిరి మండలాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలో 150 మంది మహిళలకు పాప్‌స్మియర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అంతకుమునుపు నిత్యానంద రెడ్డి సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కోసం రూపొందించిన ప్రత్యేక వాహనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ ఉషారెడ్డి, వైద్యులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జీజేరెడ్డి, సుజిత్, శశికుమార్‌రెడ్డి, ప్రవీణ్ మాచవరం, వేణురెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైంది


ఉపాధ్యాయుడు పెద్దరెడ్డప్పను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

పెద్దమండ్యం, జూన్ 30: ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైందని పెద్దమండ్యం ఎంఈవో మనోహర్ పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలం యల్లంవారిపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కె. పెద్దరెడ్డప్ప ఆదివారం పదవి విరమణ కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు ఆయనకు దుశ్శాలువతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పదన్నారు. ప్రశాంతంగా పదవి విరమణ పొందినపుడే వృత్తికి న్యాయం చేశామని భావన ఉంటుందని పెద్దరెడ్డప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు భాగ్యమ్మ, అమీర్ ఉపాధ్యాయులు వెంకటరమణ, నవీణ్‌కుమార్, జగనాథ శాస్త్రి, పద్మజా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

మదనపల్లె అర్బన్, జూన్ 30: స్థానిక బొంతలవారిసత్రంలో ఆదివారం మదనపల్లె మరాఠి సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు పూలమాలలు వేసి దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ మరాఠిలకు అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మరాఠి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

రైల్వేకోడూరు, జూన్ 30: గ్రామ పంచాయతీ, స్వచ్ఛ భారత్ కార్మికుల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాదరాజు గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. టైం స్కేలు వర్కర్స్‌కు 2 నుంచి 24 నెలల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, పెన్షన్‌తో పాటు మున్సిపల్ కార్మికులకు అమలు చేస్తున్న ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్సు అమలు చేయాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేస్తామని 1999లో ప్రభుత్వం జీవో జారీ చేసిందని గుర్తు చేశారు. జీవో నెం. 132ను వర్తింప జేయాలన్నారు. టెండర్లతో సంబంధం లేకుండా నెలకు రూ. 10 వేలు తగ్గకుండా జీతాలు ఇవ్వాలని డిమాండు చేశారు. దహన సంస్కారాలకు సాయం అందించాలన్నారు. గత ఏడేళ్లుగా జీతాలు పెంచలేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.